హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.133	220	240
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 16.2

- పురుషుల కన్నా మహిళలే ఎక్కువ
- దేవరకొండ నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు
- భువనగిరిలో తక్కువ ఓటర్లు
- అత్యధిక మహిళా ఓటర్లున్నది ఆ ఆరు నియోజకవర్గాల్లోనే..



29,75,286

ఉమ్మడి జిల్లా ఓటర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 29,75,286 మంది ఓటర్లు నమోదయ్యారు. సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు జిల్లా ఎన్నికల అధికారులు ఈమేరకు తుది సవరణల అనంతరం ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 3,583 పోలింగ్ స్టేషన్లు నిర్ధారించారు. మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం విశేషం.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
దేవరకొండ (ఎస్టీ)	326	1,32,611	1,31,800	19	2,64,430
నాగార్జునసాగర్	306	1,16,278	1,21,300	19	2,37,597
మిర్యాలగూడ	264	1,16,222	1,21,313	26	2,37,561
నల్లగొండ	288	1,22,222	1,29,133	56	2,51,411
మునుగోడు	317	1,29,235	1,30,688	3	2,59,926
నకిరేకల్	311	1,25,991	1,29,316	4	2,55,311
హుజూర్‌నగర్	311	1,22,663	1,30,430	17	2,53,110
కోదాడ	296	1,20,150	1,27,077	20	2,47,247
సూర్యాపేట	271	1,19,999	1,26,424	14	2,46,437
తుంగతుర్తి	327	1,29,654	1,31,697	6	2,61,357
భువనగిరి	257	1,09,820	1,12,830	1	2,22,651
ఆలేరు	309	1,18,297	1,19,931	20	2,38,248
మొత్తం	3,583	14,63,142	15,11,939	205	29,75,286

ఉమ్మడి జిల్లాలోని 12 శాసనసభా నియోజవకర్గాలకు 14,63,142 మంది పురుష ఓటర్లు, 15,11,939 మంది మహిళా ఓటర్లు నమోదయ్యారు. ట్రాన్స్‌జెండర్లు 205 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. 12 నియోజకవర్గాల్లో దేవరకొండలో అత్యధికంగా 2,64,430 మంది ఓటర్లు నమోదవగా, భువనగిరిలో అత్యల్పంగా 2,22,651 మంది ఓటర్లు నమోదయ్యారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో దేవరకొండ నియోజకవర్గంలో అత్యధికంగా మహిళా ఓటర్లున్నారు. అయితే ఈ నియోజకవర్గంలో మహిళలకంటే పురుష ఓటర్లే ఎక్కువగా ఉండడం గమనార్హం. దేవరకొండ, తుంగతుర్తి, హుజూర్‌నగర్, నకిరేకల్, నల్లగొండ, కోదాడ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా నమోదయ్యారు. దేవరకొండ నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో పురుష ఓటర్లకంటే మహిళల ఓటర్లే ఎక్కువగా నమోదయ్యారు. ప్రస్తుత ఓటర్ల జాబితానే ఫైనల్ కాదని, కొత్తఓటర్లు, మార్పులు, చేర్పులు, సవరణలను ఎప్పటికప్పుడు కొనసాగించాలని ఎన్నికల జిల్లా అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.

పంటల నమోదుపై సందిగ్ధం

- ఓపెన్ కాని వ్యవసాయ శాఖ యాప్
- రైతుల వ్యతిరేకతపై ఇంటలిజెన్స్ రిపోర్టు ?
- సర్వే, రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణపై వెనుకడుగు



నల్లగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఈ నెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పంటల నమోదు సర్వే చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే వ్యవసాయశాఖ యంత్రాంగం అంతా సర్వేకు సిద్ధమైన నేపథ్యంలో 4వ తేదీన వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ ఓపెన్ కాకపోవడంతో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలోని 73 మండలాల్లోని గ్రామాల్లో పంటల నమోదు సర్వేను చేపట్టలేక పోయింది. క్షేత్రస్థాయిలో పంటల నమోదును ఎంపిక చేసిన 73గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల వరకు ప్రతీ గ్రామంలో సర్వే చేయాల్సి ఉంది. అయితే యాప్ ఓపెన్ కాకపోవడంతో నిలిచిపోయింది. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు సమాచారం. రైతుభరోసాను సంక్రాంతి పండుగనుంచి వేసే సమయంలో అనూహ్యంగా ఈ సర్వే చేపట్టాలనుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నెల 5వ తేదీన (ఆదివారం) ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు అయినందున పంటల నమోదు ప్రక్రియపై సోమవారం నిర్ణయం రావడంతోపాటు పంటల సర్వే మొదలవుతుందని సర్వత్రా భావించారు. కానీ రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నట్లు ఇంటలిజెన్స్ రిపోర్టు ప్రభుత్వానికి చేరింది. దీంతో పంటల నమోదు సర్వేతోపాటు 5, 6, 7తేదీల్లో రైతుభరోసా పొందాలంటే రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ అఫిడవిట్‌ను తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. అయితే ఈ రెండు అంశాలపై ప్రభుత్వం వెనకడుగు వేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంక్రాంతి నుంచి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరాకు రూ.6వేలను రైతుల ఖాతాల్లో జమచేయడానికి సన్నద్ధమైనట్లు తెలుస్తోంది.

అర్హులందరినీ ఓటరుగా

నమోదు చేయాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి

నల్లగొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా సోమవారం తుది ఓటరు జాబితాను ప్రచురించినప్పటికీ 18 ఏళ్లు నిండి ఓటరు నమోదుకు అర్హత ఉన్న వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని జిల్లా ఓటరు జాబితా పరిశీలికురాలు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఓటరు నమోదు అధికారులతో ఓటరు జాబితాలో ఈపీ, జెండర్ రేషియోలు, తుది ఓటరు జాబితా ప్రచురణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం అన్నిపోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయాల్లో తుది ఓటరు జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. ఓటర్లు వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో? లేదో ? పరిశీలించుకోవచ్చన్నారు. ఒకవేళ ఓటరు జాబితాలో ఎవరి పేరు లేనట్లయితే తిరిగి ఓటరు గా నమోదు చేసుకోవచ్చని, అంతేగాక 18 ఏళ్లు పూర్తయి ఓటరు నమోదుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదు అధికారులు మరోసారిఓటరు జాబితాలో చనిపోయిన వారిపేర్లు పరిశీలించి తొలగించాలని,18ఏళ్లు నిండినవారిని ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఓటరు నమోదు అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

నూతన మెనూ అమలుచేయాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రకటించిన నూతన మెనూ విషయంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకొని నూతన మెనూ అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని బీసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన బీసి సంక్షేమ శాఖ కమీషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు ఇరుకు గదుల్లో నివసిస్తూ అవస్థలకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వసతి గృహాలకు గురుకుల పాఠశాలలకు, కళాశాలలకు సొంతభవనాలని నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను కూడా తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకుడు బచ్చనబోయిన సాయికుమార్ యాదవ్, అఖిలేష్ యాదవ్, రవికుమార్ గౌడ్, పృధ్విరాజ్ , మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే

పరిష్కరించాలి: కలెక్టర్



నల్లగొండలో మహిళా ప్రాంగణంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖతో పాటు, అన్ని శాఖల అధికారులు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో 3శాతం అనాథలకు రిజర్వేషన్ అమలు చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళా ప్రాంగణం, మహిళా క్యాంటిన్ ఏర్పాటు, వైద్య, ఆరోగ్యశాఖ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్వో అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కాగా ఈ సోమవారం 87మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను సమర్పించారు.

ప్రజల్లో స్పందన ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలి

నల్లగొండ రూరల్: ప్రజల్లో స్పందన ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మహిళా ప్రాంగణాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి, మేనేజర్ అనిత, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 73మండలాల్లో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయడంకోసం కసరత్తు ముమ్మరం చేశారు. అయితే సొసైటీల ఏర్పాటు అదనంగా చేస్తే ఉన్న సిబ్బందితోనే సొసైటీలను నడపాల్సి ఉంటుంది. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో కొత్త పీఏసీఎస్‌ల నిర్వహణ ఏ మేరకు సఫలీకృతమవుతాయన్న దానిపై ఆదిలోనే కొంతమేరకు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన మండలాల్లో నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటుతోపాటు కొన్ని మండలాల్లో గ్రామాలసంఖ్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ కూడా సొసైటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



కొత్త పీఏసీఎస్‌ల కోసం

కసరత్తు ముమ్మరం

- అధికారులు, డీసీసీబీ పాలకవర్గం మల్లగుల్లాలు
- రీఆర్గనైజేషన్ చేస్తే సిబ్బంది కొరతతో ఇబ్బందులే
- ఉమ్మడి జిల్లాలో సొసైటీల కోసం ప్రతిపాదనలు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల రీఆర్గనైజేషన్ కోసం జరుగుతున్న కసరత్తుపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటుంది. సొసైటీల విస్తరణ జరిగితే ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, రైతుల సంఖ్య, దూరం ఎంత ఉంటుంది అనే దానిపై పరిశీలించాల్సి ఉంటుంది. కొత్త సొసైటీలను ఏర్పాటుచేస్తే పంట రుణాల మంజూరు, ఎరువులు, విత్తనాల విక్రయం, ధాన్యం కొనుగోలు కేంద్రాలవంటి నిర్వహణ సేవల విస్తరణను మరింత పెంచాలని పాలకవర్గం ఆలోచిస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని నూతన పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నారు.



రైతులకు మెరుగైన సేవల కోసం కొత్త సొసైటీలు

రైతులకు మెరుగైన సేవలను అందజేయడంకోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త సొసైటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. సొసైటీ ఏర్పాటు అదనంగా చేయడంవల్ల ఆ సొసైటీల సేవలు రైతులకు మరింత చేరువ కానున్నాయి. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్ని సొసైటీలు కొత్తగా ఏర్పాటు చేయాలనే దానిపై సమీక్షలు నిర్వహిస్తున్నాం. సొసైటీలను రీఆర్గనైజేషన్ చేసిన తర్వాత ఆయా ప్రాంతాల్లో కార్యాలయాల ఏర్పాటు, సిబ్బంది కొరత లేకుండా చూడాల్సి ఉంటుంది. రైతులకు మరింత ప్రయోజనం చేకూరడంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏర్పాట్లను చేస్తుంది. సొసైటీల విస్తరణ చేయడంవల్ల సేవలు మరింత సులభమవుతాయి. ఈ సొసైటీలను ఆమోదంకోసం ఆర్‌సీఎస్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

- కుంభం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్, నల్లగొండ

నూతనంగా సొసైటీలను ఏర్పాటు చేయాలంటే ఆర్‌సీఎస్(రిజిస్టర్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్) ఆమోదం తప్పనిసరిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇందులో ఆర్‌సీఎస్ అధికారులతోపాటు ఇతర అనుబంధశాఖ అధికారులంతా పాల్గొని సమీక్షలు నిర్వహించారు. సొసైటీలను ఏర్పాటుచేస్తే అందుకు కావాల్సిన సిబ్బంది, కార్యాలయాలు ఇతర ఏర్పాట్లు అన్ని చేయాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని వస్తున్న ప్రతిపాదనలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆర్‌సీఎస్ ఆమోదం తెలియజేయనుంది. అంతా సులువుగా ఆమోదం తెలియజేస్తే నిర్వహణ భారం అధికమై సొసైటీలు నిర్వీర్యమయ్యే అవకాశాలుంటాయి. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 107 సొసైటీల వరకు ఉన్నాయి. ఈ సొసైటీలు అన్ని ప్రస్తుతం ప్రగతి పథంలో ఉన్న పరిస్థితుల్లో కొత్త సొసైటీల ఏర్పాటు వల్ల ప్రయోజనం...

- మిగతా 6వ పేజీలో...

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్

మిర్యాలగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పౌష్టికాహారం అందించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి విద్యానగర్ కాలనీలోని సుభాష్‌నగర్ అర్బన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలతో ముచ్చటించారు. తండ్రి పేరు, తల్లి పేరు పిల్లల పేర్లు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లలకు పోషకాహారలోపం లేకుండా చూసేందుకు అంగన్‌వాడీల ద్వారా న్యూట్రిషియన్ ఫుడ్ అందిస్తోందన్నారు. గుడ్లు, పాలు, సన్నబియ్యం గర్భిణులు, బాలింతలకు ప్రోటీన్లు కలిగిన ఆహారం అందించాలన్నారు. పిల్లల బరువును తూచి వయసుకు తగిన బరువున్నారా? లేరా? అనే విషయాన్ని బట్టి వారికి ఆహారం ఇవ్వాలన్నారు. మిర్యాలగూడ అర్బన్‌లో 100, రూరల్‌లో 111 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, ప్రభుత్వం అందించే పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో అనిత, డీఏవో శర్మ, తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ మండలం బాబాసాహెబ్‌గూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డీడబ్ల్యూవో కృష్ణవేణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల నమోదు, ఆహార నాణ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు నకిరేకల్ సీడీపీవో ఆగా అస్ర అంజూమ్, మండల సూపర్‌వైజర్ సునీత ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అనితా రామచంద్రన్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లాలో ప్రథమస్థానం

మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్



మిర్యాలగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లాలో మిర్యాలగూడ డివిజన్ ప్రథమ స్థానంలో ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణఅమిత్ అన్నారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేలో 95 శాతం పూర్తి చేసి నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలపారు. నల్లగొండ జిల్లాలో 95 శాతం సర్వే పూర్తి చేసి మిర్యాలగూడ డివిజన్ మొద టి స్థానంలో నిలిచిందని చెప్పారు. డివిజన్‌లో 1 లక్షా 50 వేల దరఖాస్తులు రాగా సర్వే చేసి డాటా ఎంట్రీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై పూర్తిస్థాయిలో సర్వే కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

● నిధుల కేటాయింపుపై హర్షం



డిండికి నిధుల కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించడం అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

● ముక్కోటి మురిసేలా


- ఈ నెల 10న ఉత్తర ద్వార దర్శనం
- సాధారణ భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు




యాదగిరిగుట్టలో అధికారులకు సూచనలు చేస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

పుస్తకమే ప్రేరణ

అక్షర రూపం దాల్చిన ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక అంటాడు కవి కాళోజీ. అక్షరానికి ఉండే ప్రభావశీలతను ఆయన అలా వివరించారు. విలక్షణమైన అక్షరాల కలయికే పుస్తకం. ఆ పుస్తకం ప్రతీ మనిషి మస్తిష్కంపై ఎంతో ప్రభావం చూపిస్తుంది. పుస్తకాన్ని చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారూ ఉన్నారు. తమలో మార్పులను తెచ్చుకుని జీవితం సాఫీగా సాగేలా ఆలోచనలను మార్చుకున్న వారూ ఉన్నారు. పుస్తకం మనిషిలోని సమాలోచనకు మార్గనిర్దేశం చేస్తుంది. అలాంటి పుస్తకాన్ని చదివి తమలో మార్పు తెచ్చుకున్న పలువురి అభిప్రాయాలు ఇవీ.



(ఆంధ్రజ్యోతి-నల్లగొండ / సూర్యాపేట టౌన్)



ఏదీ శాశ్వతం కాదని గ్రహించా..

నాకు నచ్చిన పుస్తకం బుచ్చిబాబు రచించిన 'చివరికి మిగిలేది'. 1942లో ఈ పుస్తకం ఆయన రాశారు. ఇది మనో వైజ్ఞానిక నవల. జీవితంలో ఏదైనా కోల్పోయాం అని బాధపడుతుంటే ఒకసారి ఈ నవల చదవాలి. ఇందులో పాత్రలు మన చుట్టూ ఉన్న వారిలా అనిపిస్తుంది. మనుషుల్లో ఉండే రకరకాల భావోద్వేగాలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. నవల మధ్యలో జీవిత సత్యాలు ఉంటాయి. ఈ సమాజంలో మనిషి బతకడానికి డబ్బు, హోదా, నిజమైన ప్రేమ వాటిలో ఏది అవసరమని కథనాయకుడికి ఎదురైన ప్రశ్న. దీనికి ఈ పుస్తకంలో సమాధానం దొరుకుతుంది. ఈ నవల తర్వాత నాలో చాలా మార్పులు చేసుకున్నాను. డబ్బు ఉన్నప్పుడు, లేనప్పుడు ఇతరుల ప్రవర్తనను గమనించా. మానసికంగా ఎవరిమీదా ఆధారపడకూడదని, నిర్ణయాలు సొంతంగా తీసుకోవాలని నిర్ణయించుకున్నా. పిల్లలను సొంతంగా ఆలోచించేలా స్వేచ్ఛను ఇవ్వాలని తెలుసుకున్నా. ఆపినా ఆగని యవ్వనం, ఆరోగ్యం, మృత్యువు గురించి ఎక్కువగా ఏడవాల్సిన పనిలేదని గ్రహించా.

- కర్నాటి అశోక్, ఎన్‌డీసీసీబీ మేనేజర్, చిట్యాల బ్రాంచ్

ఉద్యమం వైపు మళ్లించింది

నేను 1982 సంవత్సరంలో 'ఎర్రమల్లెలు' సినిమా చూశా. సామాజిక అంశాలపై నాకు ఒక అవగాహన వచ్చింది. అనంతరం వైద్య వృత్తిలో స్థిరపడ్డా. వైద్య వృత్తిలో ఉంటూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నా. కాళోజీ నారాయణరావు ప్రభావం నాపై ఉంది. ఇదే క్రమంలో జయశంకర్‌సార్ రాసిన 'వొడువని ముచ్చట' చదివా. తెలంగాణ భాష, యాస, అస్థిత్వం, నీళ్లు, నిధులు, నియామకాలు తదితరాలపై అవగాహన ఏర్పడింది. ఎన్నో ఏళ్ల రగిలిన తెలంగాణ ఆకాంక్షనే జయశంకర్ సార్ వొడువని ముచ్చటలో కళ్లకు కట్టేలా వివరించారు. నేను ఆయన బాటలోనే ఉద్యమంలో పాల్గొన్నా. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నా. ఏపని చేసినా లక్ష్యం చేరేవరకు వదలవద్దని తెలుసుకున్నా.

- తోట నర్సింహాచారి, వైద్యుడు, నల్లగొండ



తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్

ధృడ సంకల్పంతో పనిచేయాలని నిర్ణయించుకున్నా...



మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక అమెరికాలో వర్ణ సంఘర్షణలు విజృంభించాయి. రెండో ప్రపంచ యుద్ధం కాలంలో నల్ల, తెల్ల జాతుల మధ్య స్పర్థలు, వైషమ్యాలు మరింత పెరిగాయి. తెల్లవాళ్లు దాతలుగా, నల్లవాళ్లు గ్రహీతలుగా ఉండే వ్యవస్థ పోయి సమాన భాగస్వాములుగా ఉండే సామాజిక వ్యవస్థ కోసం అమెరికాలో నల్లజాతి పోరాడుతోంది. ఆ పోరాట ప్రతిధ్వనులను ఎలెక్స్ హేలీ 'రూట్స్' అనే పుస్తకంలో వివరించారు. అది తెలుగులో ఏడు తరాలుగా వెలువడింది. స్వేచ్ఛ నుంచి సంకెళ్ల దాకా, సంకెళ్ల నుంచి విముక్తికి సాగిన ఒక ప్రస్థానం ఏడు తరాలు. ఈ పుస్తకం నాలో ఆలోచనల్లో మార్పులను తీసుకువచ్చింది. విముక్తి కోసం జరిపే పోరాటం, సంస్కృతీ, సంప్రదాయాలను నిలబెట్టుకోవడం కోసం పడే తాపత్రయం మనలను వెంటాడుతాయి. నిగ్గర్ల హింస మనస్సును కలుక్కుమనిపిస్తుంది. ప్రపంచానికి నాగరికత నేర్పానని చెప్పుకునే దేశం చేసిన అనాగరిక పనికి ప్రత్యక్ష సాక్ష్యాలు కూడా. తరిచి చదవగలిగితే ఎన్నో జీవిత సత్యాలను విప్పి చెబుతుందీ నవల. రచయిత సహవాసి రాసిన ఎన్నో చిన్న వాక్యాలు పదే పదే వెంటాడతాయి. ఆలోచనల్లో పడేస్తాయి. ప్రతి ఒక్కరూ చదవాల్సిన నవల. ఈ పుస్తకం చదివాక పోరాడితేనే బానిసత్వం, పేదరికం పోతుందని నిర్ణయానికి వచ్చా. ఏదైనా లక్ష్యం కోసం ధృడంగా కష్టపడి పనిచేయాలని నిర్ణయించుకుని ఆ దిశగా ఏ పని అయినా చేస్తున్నా.

- విప్పల సాంబిరెడ్డి, డివిజనల్ పంచాయతీ ఆఫీసర్, సూర్యాపేట జిల్లా

లక్ష్యం కోసం పనిచేస్తే శ్రమ తెలియదని తెలుసుకున్నా



రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలి పుస్తకం నాకు ఇష్టమైనది. మాది యాదాద్రిభువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామం. చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదివే అలవాటు ఉండేది. గ్రామంలోని గ్రంథాలయం నుంచి మహనీయుల పుస్తకాలు తెచ్చుకుని చదివేవాడిని. ఆ క్ర మంలోనే రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్రను చదివా. బెం గాల్‌లోని చిన్నగ్రామంలో జన్మించిన ఠాగూర్ ఆసియాలోనే మొట్టమొదటి నోబెల్ బహుమతిని అందుకుని విశ్వకవిగా అవతరించేందుకు ఆయన పడిన శ్రమను గమనించా. కష్టపడితే ఏదైనా సాధించవచ్చన్న వారి స్ఫూర్తి నాలో పెరిగింది. అదే నేను పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించేలా చేసింది. ఒక లక్ష్యం కోసం పనిచేస్తే శ్రమ తెలియదని నేర్చుకున్నా. ఆ పుస్తకాల స్ఫూర్తితోనే ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్ స్థాయిలో ఉన్నా.

- గంటెపాక నర్సింహ, సీఐ, సూర్యాపేట

బ్రెయిన్ స్ట్రోక్‌తో యువతి మృతి


సాత్విక(ఫైల్)

హుజూర్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన చికాకోళ్ల సాత్విక(19) సోమవారం బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందింది. యువతి తండ్రి శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్‌లోని కనకదుర్గ వీధిలో నివాసం ఉంటున్న శ్రీనివాసాచారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పృథ్వీ బీటెక్ పూర్తిచేసి ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తుండగా, కుమార్తె సాత్విక హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 4వ తేదీన సాత్వికకు జ్వరం రాగా హుజూర్‌నగర్‌కు వచ్చి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఎంతకూ జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షల్లో షుగర్ లెవల్స్ 700కు పెరిగాయని వైద్యులు తెలిపారు. షుగర్ లెవల్స్ పెరగడంతో ఆ ప్రభావం గుండె, కిడ్నీలపై పడగా కోమాలోకి వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. సాత్విక మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హుజూర్‌నగర్‌లో ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాసాచారి హుజూర్‌నగర్ శివాలయం కమిటీ ధర్మకర్తగా పనిచేశారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య


సంతోష్(ఫైల్)

తుర్కపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జులాయిగా తిరుగుతున్నావని తండ్రి మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం పెద్దతండాలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధరావత్ అంబీ, సక్రు దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, రెండో కుమారుడు సంతోష్(25) డిగ్రీ పూర్తిచేశాడు. ఏ ఉద్యోగం చేయకుండా జులాయిగా తిరుగుతండటంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ ఆదివారం సాయంత్రం తండాలోని వరుసకు చిన్నమ్మ ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. తండ్రి సక్రు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుమ్మడంలో వివాహిత అదృశ్యం


మానస

నిడమనూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : భర్తతో తగాదాల నేపథ్యంలో వివాహిత అదృశ్యమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మడం గ్రామానికి చెందిన జోగునూరు మానస(22) నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తిని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. భార్యాభర్తలు గ్రామంలోనే ఉంటున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి ఇంట్లో మానస కనబడకపోవడంతో చుట్టుపక్కలవారు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె మొబైల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీంతో తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తల్లి పోతుగంటి పద్మ సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కారు, ఆటో ఢీ: ముగ్గురికి తీవ్రగాయాలు

చింతపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో సోమవారం జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన వూరె శివ(ఆటో డ్రైవర్), బైకాని నరసింహ, తండ్రి సత్తయ్య, బైకాని శివ, చింతపల్లి నుంచి కుర్మేడ్ వైపునకు వస్తున్నారు. ఈ క్రమంలో మాల్ నుంచి చింతపల్లికి వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను దేవులతండా వద్ద బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మాల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ వూరె శివ బాబాయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిలిండర్ పేలి చికెన్‌సెంటర్ దగ్ధం

చిట్యాల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్‌సిలిండర్ పేలడంతో చికెన్ సెంటర్ షెడ్డు దగ్ధమైనది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం ఉరుమడ్లకు చెందిన గురిజ పాండు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమీపంలో కొన్నేళ్లుగా చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరే పాండు ఆదివారం చికెన్ సెంటర్‌ను మూసి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి మంటలు వ్యాపించడంతో షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. దీంతో రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

పెద్దవూర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అవకతవకలకు పాల్పడిన రేషన్ దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా పెద్దవూర డీటీఏ ముక్తార్ తెలిపారు. చలకుర్తిలోని 2352042 దుకాణాన్ని సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో అధికారుల తనిఖీ చేసినట్లు తెలిపారు. నిల్వల్లో 23.83 క్వింటాళ్ల వ్యత్యాసం ఉండటంతో డీలర్ రమావత్ దేశ్యానాయక్‌పై 6-ఏ కేసు నమోదు చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆదేశాల మేరకు డీలర్లు లబ్ధిదారులకు బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.ఆయన వెంట ఆర్ఐ హబీబ్ ఉన్నారు.

నేడు, రేపు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

భువనగిరి రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట నుంచి యాదాద్రిభువనగిరి జిల్లాకు వచ్చే పైపులైన్ మరమ్మతుల కారణంగా మంగళ, బుధ వారాల్లో రెండు రోజులపాటు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈ పీ కరుణాకరన్ సోమవారం తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలోని బీబీనగర్, భువనగిరి, వలిగొండ, రామన్నపేటలో (8గ్రామాలు), పోచంపల్లిలో (16గ్రామాలు), భూదాన్‌పోచంపల్లి మునిసిపాలిటీ పరిధిలో కొత్తగా చేరిన (9గ్రామాలు), ఆలేరు నియోజకవర్గంలోని రాజాపేట, ఆత్మకూర్(ఎం), యాదగిరిగుట్ట, ఆలేరు, గుండాల, తుర్కపల్లి, మోటకొండూరు, బొమ్మలరామారం మండలాల్లో గోదావరి నుంచి వచ్చే మంచినీటిని సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. నీటి సరఫరా నిలిపివేస్తున్నందున ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త పీఏసీఎస్‌ల కోసం కసరత్తు ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

మెరుగుపడాలి తప్ప ఏమాత్రం సొసైటీల నిర్వహణ సిబ్బంది కొరత మూలంగా ఇబ్బందులు తలెత్తకూడదనేది స్పష్టమవుతుంది. కొత్త సొసైటీల వల్ల ఆయా సొసైటీలకు చైర్మన్‌తోపాటు సీఈవో, కొత్త సిబ్బంది వస్తారు. ఆయా సొసైటీల పరిధిలో రైతులకు మెరుగైన సేవలు అందుతాయని నమ్మిన తర్వాతే ముందుకు సాగాలని డీసీసీబీ పాలకవర్గంతోపాటు ప్రభుత్వం ఆర్‌సీఎస్, నాబార్డు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రూ.2700కోట్లకు పైగా టర్నోవర్‌తో జిల్లా సహకారకేంద్ర బ్యాంకు ముందుకు సాగుతూ మొత్తం రూ.3వేల కోట్ల టర్నోవర్ చేయాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త సొసైటీల ఏర్పాటు వల్ల డీసీసీబీకి మరింత బలం చేకూరాలన్న ఆలోచనతో పాలకవర్గం అడుగులు వేస్తుంది. అదేవిధంగా ఇటీవల 20 రోజులపాటు నాబార్డు బృందం డీసీసీబీలో రెండేళ్లుగా నిర్వహణ తీరుపై పరిశీలన చేసి అభినందించింది. నూటికి99శాతం సరిగ్గా అకౌంటింగ్ నిర్వహించడం, అదేవిధంగా రుణాల పంపిణీ, డిపాజిట్ల పెంపుదల, టర్నోవర్, ఇతర అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి పాలకవర్గం పనితీరును మెచ్చుకున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అత్యధికంగానే పీఏసీఎస్‌లు వస్తాయన్న ఆలోచనతో, ఆశాభావంతో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ప్రతిపాదనలు

కొత్త సొసైటీలకోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ఎత్తున ప్రతిపాదనలు వస్తున్నట్లు సమాచారం. రాజకీయంగా చూస్తే చైర్మన్ పదవులతోపాటు, ఆ సొసైటీలకు డైరెక్టర్ పదవులకు కూడా అధికమవుతాయన్న ఆలోచనతో ఆ ప్రాంత రాజకీయనాయకులు కూడా ఉండటంతో తమకు సొసైటీలు కావాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతానికి అయితే జిల్లా సహకార అధికారులు, డీసీసీబీ పాలకవర్గం సమన్వయంతో కొత్త మండలాలను పరిగణలోకి తీసుకొని సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని మండలాలకు అధికంగా సొసైటీలు కావాలని కోరినట్లయితే వాటిని కూడా ఆర్‌సీఎస్ పరిశీలన చేయాల్సి ఉంటుంది. మండలానికి రెండు సొసైటీలు అవసరమనుకుంటే రీఆర్గనైజేషన్ చేయవచ్చు అని, అదే పెద్ద మండలం అని భావించి ఐదు సొసైటీలను కోరినట్లయితే అది సాధ్యమయ్యే పరిస్థితి కాదనేది స్పష్టం అవుతుంది. 2013 తర్వాత కొత్తగా సహకార సంఘాల ఏర్పాటు చేయలేదు. 2023లో కొత్త సొసైటీల ఏర్పాటుకోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి లేఖ రాసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయించింది.

నిడమనూరు మండలంలో పెరగనున్న సొసైటీలు

నిడమనూరు: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో ప్రస్తుతం నిడమనూరు, వెనిగండ్ల సహకార సంఘాలు ఉండగా కొత్తగా రెండు సహకార సంఘాలు ఏర్పాటు కానున్నాయి. తుమ్మడం, ఊట్కూరు గ్రామాల్లో పీఏసీఎస్‌లుగా ఏర్పాటుచేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. నాన్‌ఆయకట్టు ప్రాంతంలోని కొన్నిగ్రామాలను కలిపి ఊట్కూరు సొసైటీగా, ఆయకట్టు ప్రాంతంలోని గ్రామాలను కలిపి తుమ్మడం సొసైటీగా ఏర్పాటుచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.వచ్చే నెలలో సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగుస్తుంది. దీంతో కొత్త సహకార సంఘాలు ఏర్పాటుచేసిన తర్వాతే సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త సహకారసంఘాలు ఏర్పాటుపై ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సహకార సేవలు రైతుల ముంగిట్లోకి వస్తాయని ఆశిస్తున్నారు. గతంలో మండలంలో నిడమనూరు, ఊట్కూరు, తుమ్మడం, వేంపాడ్, రేగులగడ్డ, వెనిగండ్ల ఆరు పీఏసీఎస్‌లు ఉండేవి ఇందులో వెనిగండ్ల మినహా మిగతా ఐదు సంఘాలకు సొంత భవనాలు ఉన్నాయి. వేంపాడ్ పీఏసీఎస్ భవనాన్ని 1998లో నక్సల్స్ పేల్చివేశారు. ఇందులో నిడమనూరు మినహా తుమ్మడం, ఊట్కూరు, రేగులగడ్డ భవనాలు వినియోగంలో లేకపోవడంతో పాటు పాతవి కావడంతో శిథిలావస్థలో ఉన్నాయి. రేగులగడ్డలోని భవనం అన్యాక్రాంతమవుతుండటంతో ఇటీవల రూ.80వేలు వెచ్చించి ప్రహరీ ఏర్పాటు చేశారు. కాగా ఆర్థిక పరిపుష్టిలేని సంఘాలను ఇతర సొసైటీల్లో విలీనం చేయాలని 2005లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఊట్కూరు, తుమ్మడం, వేంపాడ్, రేగులగడ్డ నాలుగు సొసైటీలను నిడమనూరు సొసైటీలో విలీనం చేశారు. ఆర్థిక పరిపుష్టి కలిగి లాభాలతో నడుస్తుందన్న కారణంతో వెనిగండ్ల సొసైటీని అలాగే ఉంచారు. దీంతో ప్రస్తుతం మండలంలో నిడమనూరు, వెనిగండ్ల రెండు సొసైటీలు మాత్రమే ఉన్నాయి. ఇందులో 5,936 మంది సభ్యులతో నిడమనూరు పెద్ద సొసైటీగా ఉండి మంచి లాభాలతో నడుస్తుంది. అదేవిధంగా 851 మంది సభ్యులతో వెనిగండ్ల సొసైటీ పనిచేస్తుంది. మండలంలో కొత్తగా మరోరెండు సహకార సంఘాలు ఏర్పాటైతే సొసైటీల సంఖ్య నాలుగుకు చేరనుంది. కొత్త సహకార సంఘాల ఏర్పాటుకోసం ఆయా గ్రామాల్లోని రైతులు ఎదురుచూస్తున్నారు.

రెండు సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం



ఉన్నతాధికారుల సూచనతో మండలంలో కొత్తగా రెండు పీఏసీఎస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. కొత్త సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే నిడమనూరు సొసైటీ పరిధిలోని తుమ్మడం, ఊట్కూరులో కొత్త సంఘాలు ఏర్పడే అవకాశం ఉంది. తుమ్మడం, ఊట్కూరు గ్రామాల్లో సొసైటీలకు సొంత భవనాలు కూడా ఉన్నాయి.

బుచ్చాల జానయ్య, సీఈవో, నిడమనూరు సొసైటీ.

పాదయాత్రలో ప్రత్యేకం పుంగనూరు ఆవు

- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గో రక్షణ పేరిట పాదయాత్ర
- గురుస్వామికి తోడుగా ఆవు కూడా...
- ఆవు కోసం ప్రత్యేక వాహనం, ఏర్పాట్లు


పాదయాత్రలో తన వెంట తీసుకెళ్తున్న పుంగనూరు జాతి ఆవుతో బాలకృష్ణ గురుస్వామి

చౌటుప్పల్ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గో రక్షణ కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సాగుతున్న బాలకృష్ణ గురుస్వామి మహాపాదయాత్రలో తోడుగా నడుస్తున్న తెలుగు రాష్ట్రానికి చెందిన పుంగనూరు జాతి ఆవు అందరినీ ఆకర్షిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన అఖిల భారత గో సేవ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ గురుస్వామి గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ 2024 సెప్టెంబరు 27న కశ్మీర్‌లోని లాల్‌చౌక్ నుంచి గో రక్ష మహా పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర 14 రాష్ట్రాల మీదుగా ఐదు వేల కిలోమీటర్లు సాగి తమిళనాడులోని కన్యాకుమారిలో ముగియనుంది. గోరక్షణ కోసం జరుగుతున్న యాత్రలో స్వయంగా గోవు కూడా పాల్గొంటుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సుమారు 5 వేల కిలోమీటర్ల పాదయాత్రలో ఒక గోవు పాల్గొనడం ఇదే మొదటిగా నిర్వాహకులు తెలిపారు. ఇది ఒక నూతన ప్రక్రియకు నాందిగా వారు భావిస్తున్నారు.

పుంగనూరు జాతి గోవు

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పుంగనూరు జాతికి చెందిన ఆవు అనేక విశిష్టతలను కలిగి ఉంది. మూడు సంవత్సరాల 4 నెలల వయస్సు కలిగిన ఈ ఆవు కశ్మీర్ నుంచి బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన మహాపాదయాత్రలో ఆకర్షణగా నిలుస్తోంది. గురుస్వామి రోజుకు 35 నుంచి 40 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తుండగా, ఈ పాదయాత్రలో 6 నుంచి 8 కిలోమీటర్లు ఈ ఆవు నడుస్తుంది. ఆవుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనంలో ఫ్యాన్లతో పాటు ఏసీలను అమర్చారు. ఆయా ప్రాంతాలలో నెలకొనే వాతావరణాలను బట్టి ఆవు సంరక్షణకు ఫ్యాన్లు, ఏసీలను వినియోగిస్తుంటారు. ఈ గోవుకు అయ్యప్ప మాల ధారణ చేశారు. ఆవుకు ఇరుముడిని కట్టారు. ఈ ఆవు 2025 మార్చి 5న కేరళలోని శబరిమలైలోని అయ్యప్పస్వామిని దర్శించుకుంటుంది. కేరళ రాష్ట్రంలో సాగే పాదయాత్రలో భాగంగా అయ్యప్పస్వామిని ఆవు దర్శించుకుంటుందని యాత్ర నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించి అక్కడ ప్రత్యేకఏర్పాట్లు చేయనున్నారు. పాదయాత్ర అనివార్య కారణాలతో 15 రోజులు ఆలస్యం కావడంతో అయ్యప్ప దర్శనం కూడా మరో 15 రోజులు పొడిగించే అవకాశాలు ఉంటాయి.

15 రోజుల విరామం అనంతరం

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ చేరుకున్న పాదయాత్ర 15 రోజుల విరామం అనంతరం ఈ నెల 9న బాలకృష్ణ గురుస్వామి మహా పాదయాత్ర పునఃప్రారంభం కానుంది. కశ్మీర్‌లో ప్రారంభమైన మహా పాదయాత్ర హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మీదుగా తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించి డిసెంబరు 25న చౌటుప్పల్ పట్టణానికి చేరుకుంది. ఇక్కడ వ్యాన్ నుంచి ఆవును కిందకు దించే సమయంలో స్వాగతం పలికే భక్తుల రద్దీ అధికమై తొక్కిసలాట జరిగింది. ఆ సమయంలో ఆవు దూకడంతో బాలకృష్ణ గురుస్వామి గాయపడ్డారు. ఎముకలు విరగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్యుల సలహా మేరకు అప్పటి నుంచి చౌటుప్పల్‌లోనే చికిత్స పొందుతున్నారు. గురుస్వామి ఆరోగ్యం కొంత మెరుగు కావడంతో పాదయాత్రను ఇక్కడి నుంచి ఈ నెల 9న పునః ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పాదయాత్ర తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో సాగనుంది. కేరళ నుంచి తిరిగి తమిళనాడులోని కన్యాకుమారికి చేరుకుంటుంది. ఇప్పటివరకు 90రోజులు సాగిన ఈ పాదయాత్ర మరో 90రోజుల పాటు సాగి కన్యాకుమారికి చేరుకుంటుంది. 2024 సెప్టెంబరు 27న ప్రారంభమైన పాదయాత్ర 14రాష్ట్రాల మీదుగా 5 వేల పై చిలుకు కిలోమీటర్లు సాగి ఈ ఏడాది మార్చి 27న ముగియాల్సి ఉంది. కానీ గురుస్వామి గాయపడిన సంఘటనతో మరికొన్ని రోజులు ఆలస్యం జరగనుంది. ఇప్పటి వరకు గురుస్వామి 2,780 కిలోమీటర్లు పాదయాత్ర చేయగా, మిగిలిన రాష్ట్రాల్లో మరో 2300 కిలోమీటర్ల పాదయాత్రను నిర్వహించాల్సి ఉంటుంది.

ప్రధాని మోదీ ఇంటిలో...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంటిలో పుంగనూరు జాతికి చెందిన ఆవు పూజలు అందుకుంటుంది. ఈ ఆవును పూజించిన అనంతరమే మోదీ తన అధికారిక, అనధికారిక కార్యక్రమాలలో పాల్గొంటారు అని గురుస్వామి తెలిపారు.

రెండున్నర అడుగుల ఎత్తు



ఈ ఆవు రెండున్నర అడుగుల ఎత్తు, మూడున్నర అడుగుల వెడల్పుతో బలిష్టంగా ఉంది. తోక నేలకు తాకుతుంది. సుమారు రెండు కిలోల వెండితో కిరీటం, గొలుసు, కాళ్ల కడాలు, కొమ్ములకు బుర్రలు తదితర ఆభరణాలతో పాటు పట్టు వస్త్రాలను అలంకరిస్తున్నారు. పుంగనూరు జాతి ఆవులు ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ జాతికి సంబంధించిన ఆవు పాలనే అభిషేకాలకు ఉపయోగిస్తారు. పచ్చగడ్డితో పాటు ఎండు గడ్డిని మాత్రమే ఆహారంగా తీసుకుంటుంది. స్వచ్ఛమైన పాలను అందిస్తుంది. కొన్ని ప్రాంతాలలో వాతావరణం సరిపడక జ్వరం బారిన పడిన ఆవుకు అందుకు తగిన నివారణ మందులను తాగిస్తున్నట్లు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. బాలకృష్ణ గురుస్వామితో పాటు ఆవు స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో విశ్రాంతి తీసుకుంటుంది. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ప్రముఖ అయ్యప్ప భక్తుడు బొబ్బిళ్ల మురళి గురుస్వామి చేశారు.

శివకేశవులకు విశేష పూజలు


ధనుర్మాసోత్సవాల్లో పాల్గొన్న మహిళా భక్తులు

భువనగిరి అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీన రసింహ స్వామి కొండపై శివకేశవులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసి దళాలతో అర్చించారు. అష్టభు జి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనా మార్చ నలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖ మండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.20,69,197ల ఆదాయం సమకూరిందని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ధనుర్మాసోత్సవాలు 22వ రోజు వైభవంగా కొన సాగాయి. మహిళ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్రానికి జాతీయ స్థాయిలో పేరు తేవాలి



నల్లగొండ జట్టుకు బహుమతి అందజేస్తున్న మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ టోర్నమెంట్ పోటీల్లో ఎంపికైన తెలంగాణ జట్టు గెలుపొంది రాష్ట్రానికి మంచి పేరు తేవాలని నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్ అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో అండర్-19 స్కూల్ గేమ్స్ బాలికల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ జట్టు ఎంపిక పోటీల్లో ఆయన మాట్లాడారు. పాత జిల్లాల నుంచి జట్లు మధ్య పోటీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జట్టు ప్రథమ, నల్లగొండ జట్టు ద్వితీయ, నిజామాబాద్ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో కృష్ణారెడ్డి, అండర్ -19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఇందిరా, స్కూల్ గేమ్ సెక్రటరీ విమల, హాకీ అసోసియేషన్ కార్యదర్శి కరీం, వ్యాయామ ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్, ధర్మేందర్, సురేందర్, కరుణాకర్, కోచ్‌లు మురళీ, యావర్, తదితరులు పాల్గొన్నారు.

'మా టీచర్లను పాఠశాలకు పంపండి'

కనగల్ కేజీబీవీలో విద్యార్థుల నిరసన

కనగల్, జనవరి 6:(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల ఉపాధ్యాయులను పంపించాలని నల్లగొండ జిల్లా కనగల్ కేజీబీవీలో విద్యార్థులు సోమవారం నిరసన తెలిపారు. సమ్మెలో ఉన్న కేజీబీవీ ఉపాధ్యాయులను బడికి రప్పించాలని కోరారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో డీఈవో భిక్షపతి, తహసీల్దార్ పద్మ, ఎంఈవో పద్మ పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇతర పాఠశాలల నుంచి కేటాయించిన ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని చదువులో రాణించాలని సూచించారు. పూర్తి నివేదిక అందజేయాలని ఎంఈవో డీఈవో ఆదేశించారని తెలిసింది.


పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ముక్కోటి మురిసేలా

- ఈ నెల 10న ఉత్తర ద్వార దర్శనం
- ప్రజాప్రతినిధులు, అధికారులకు వేర్వేరు గ్యాలరీలు
- సాధారణ భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు


యాదగిరిగుట్ట ఆలయ తిరువీధిలో అధికారులకు సూచనలు చేస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వా మి దర్శనం కల్పించేందుకు ముక్కోటి ఏకాదశి వేడుక ల్లో భక్తులు మురిసేలా! ఆలయ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ము క్కోటి ఏకాదశి. 2025 జనవరి 10న స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే 2024 డిసెంబరు 16 నుంచి మకర సంక్రాంతి వరకు ధనుర్మాస వేడుకలు కొనసాగుతాయి. శ్రీరంగనాథుడి పరిణయ మాడేందుకు గోదాదేవి అమ్మవారు ఆచరించిన 30రోజుల తిరుప్పావై వ్రతంలో రోజుకో పాశురం చొప్పున 30పాశురాల పఠిస్తారు. ధనుర్మా సోత్సవాలు, ముక్కోటి ఏకాదశి వేడుకలు ఏటేటా కలిసి రావడం శుభకరమని ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీ నరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు తెలిపారు.

భక్తిభావం పెంపొందేలా వేడుకలు

వైకుంఠ ఏకాదశి వేడుకలు తెల్లవారుజామున 5.15గంటలకు వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు చెప్పారు. సుమారు గంట పాటు సాగే ఉత్తర ద్వార దర్శనం ఆధ్యాత్మిక ప్రపంచంలోకి భక్తులు లీనమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేస్తారు. పండితుల వేద మంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ భక్తిభావం పెంపొందేలా వేడుకలు నిర్వహించనున్నారు.

పాతగుట్ట ఆలయంలోనూ..

పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి వేడుకలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఉత్తర ద్వారం చెంత ఖాళీ స్థలంలో భక్తులు వేచి ఉండే సదపాయం కల్పిస్తారు. విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేయనున్నారు. ప్రధానాలయం పునర్నిర్మాణం నుంచి ఇక్కడ జరిగే స్వామివారి వేడుకల్లో భక్తుల ప్రాధాన్యం పెరిగింది. ప్రధానాలయం ప్రారంభం తర్వాత రద్దీ దృష్ట్యా అధిక సంఖ్యలో స్థానికులు పాతగుట్ట స్వామివారి దర్శించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు.

వేర్వేరు గ్యాలరీలు

ఉత్తర ద్వార దర్శనం పురస్కరించుకొని కొండపైన ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. 100మంది ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, మీడియా ప్రతినిధులు, సుమారు 10వేల మంది సాధారణ భక్తులు దర్శించుకుంటారనే అంచనాలతో వేర్వేరుగా ప్రత్యేక గ్యాలరీలతో పాటు ప్రత్యేకంగా భద్రత సిబ్బంది ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

ఈ నెల 10వ తేదీన నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకల ఏర్పాట్లను ఈవో ఏ. భాస్కర్‌రావు పరిశీలించారు. ఆలయ ఉత్తర తిరువీధుల్లో వేడుకల ఏర్పాట్లపై సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అధికారులు రాజన్‌బాబు, రఘుతో కలిసి స్థల పరిశీలించారు. ఉత్తర ద్వారానికి ఇరువైపులా వేదికలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. తూర్పు రాజగోపురం ఎదురుగా భక్తుల రద్దీ తట్టుకునేందుకు కొత్తగా గ్రిల్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లల తల్లులు కోసం ప్రత్యేకంగా ఈ నెల 1వ తేదీ నుంచి ఉదయం 11నుంచి 11.30 వరకు తిరిగి సాయంత్రం 5 నుంచి 5.30గంటల వరకు రెండు పూటల బ్రేక్ దర్శనం వలె అర్ధగంట సమయం కేటాయించారు. వీరి కోసం కొత్తగా ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను మూసి, తీసి తనిఖీ చేశారు.

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా వేడుకలు



ఏటేటా నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భక్తిభావం వెల్లివిరిసేలా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. తెల్లవారుజామున జరగబోవు స్వామివారి ఉత్తర ద్వార దర్శనాన్ని తిలకించేందుకు భక్తుల కోసం ప్రత్యేకంగా వీఐపీ, వీవీఐపీలకు గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నాం. భారీగా భక్తులు తరలివస్తున్న అంచనాలతో ఏర్పాట్లు కూడా అదే స్థాయిలో చేస్తున్నాం.

- భాస్కర్‌రావు, యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో



మట్టపల్లి క్షేత్రానికి వెళ్దామిలా..

హైదరాబాద్ నుంచి మట్టపల్లికి వయా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ మీదుగా 220కిలో మీటర్లు, హైదరాబాద్ నుంచి మట్టపల్లికి వయా నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ మీదుగా 208కిలో మీటర్ల దూరంలో క్షేత్రానికి చేరుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గుంటూరు నుంచి పిడుగురాళ్ళ దాచేపల్లి మీదుగా తంగెడ మీదుగా మట్టపల్లి క్షేత్రానికి చేరుకోవాలి. కోదాడ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, మాచర్ల డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాట్లు చేస్తోంది.

మట్టపల్లి క్షేత్రంలో..

మఠంపలి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టపల్లి వద్ద స్వయంభువుగా విరాజిల్లుతున్న మట్టల్లి మహ క్షేత్రంలో ఈ నెల 9, 10వ తేదీల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తెలిపారు. జనవరి 9న సాయంత్రం 5గంటలకు మంగళ వాయిద్యాలతో ఈ వేడుకలు ప్రాంభమవుతాయని, 3గంటలకు వేద మంత్ర పఠనం, 7గంటలకు శాస్త్రీయ సంగీతకచేరి, రాత్రి 9గంటలకు భక్తప్రహ్లాద కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 10వ తేదీ శుక్రవారం ఉదయం 3గంటలకు ప్రాతఃకాలార్చన, 4:30నిషాలకు ధృవ స్వామి వారికి అభిషేకం, 5గంటలకు శ్రీస్వామివారి వైకుంఠ ద్వార దర్శనము 8గంటలకు నాదస్వర కచేరి, 9 గంటలకు వైకుంఠ ఏకాదశి మహత్యం, ఒంటి గంటకు లక్ష ఆరెపత్రి పూజ, మధ్యాహ్నం 2గంటలకు స్వామి వారి ఆలయ ప్రవేశం, రాత్రి 8గంటలకు మట్టపల్లి మహా క్షేత్రవేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు ప్రారంభం

కేతేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లిలోని జపమాల మాత చర్చిలో క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు(ముగ్గురు రాజుల పండుగ) సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలను ఈ ఏడాది రెండు రోజులకు కుదించారు. పండుగ సందర్భంగా చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపైనిర్వహించిన ప్రార్థనలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల చర్చిలకు చెందిన విచారణ గురువులు, మతకన్యలు, క్రీస్తు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూజా కార్యక్రమాలు సీనియర్ మతగురువు క్రీస్తురాజు ఆధ్వర్యంలో సాగాయి. ముగ్గురు రాజుల మహోత్సవానికి క్రైస్తవంలో ప్రత్యేకత ఉందన్నారు. పరుల కొరకు పుట్టిన ఏకైక దేవుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు. ఏసుక్రీస్తు ప్రేమానుభూతిని ప్రతి క్రైస్తవుడూ ఆస్వాదించాలని కోరారు. అట్టడుగున ఉన్నవారిని అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రతి వారు తోడ్పాటు అందించాలన్నారు. ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన ఏసు ప్రభువు లోకరక్షకుడని కొనియాడారు. క్రీస్తు మార్గంలో ప్రతివారు పయనించాలన్నారు. స్థానిక చర్చి ఫాదర్ ఎం. ప్రాన్సీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో చర్చి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చి ఎదుట గల సర్వీసు రోడ్డు వెంట తిరునాళ్లలో రకరకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. పిల్లల ఆట వస్తువులు, మహిళల అలంకరణ సామాగ్రి, తినుబండారాలు తదితర దుకాణాలతో చర్చి పరిసరాలు నిండిపోయాయి.


కేతేపల్లి చర్చి ఆవరణలో త్యేక వేదికపై ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి

కట్టంగూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వాహనాలు నడిపే ట్రక్కు డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలని నల్లగొండ ఎంవీఐ లావణ్య అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలల్లో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా కట్టంగూరు శివారులోని 65వ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఒరిస్సా దాబా వద్ద ఆరోగ్యశాఖ సిబ్బందితో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. రోడ్డు ప్రమాద నివారణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టంగూరు ఎస్‌ఐ రవీందర్, ఎంవీఐ డీటీవో మల్లికార్జున్, ఏఎంవీఐ సతీష్, మెడికల్ సిబ్బంది ఉన్నారు.

ఫిబ్రవరిలో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతికోత్సవాలు

మోత్కూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతికోత్సవాలు నిర్వహించనున్నట్లు అఖిల పక్ష నాయకులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు తెలిపారు. మోత్కూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడారు. మోత్కూరులో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలకు నగదు బహుమతులు, షీల్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మందుల సామేలు సహకారంతో పోటీలు నిర్వహించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి కోలాటం పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంఈవో టి. గోపాల్‌రెడ్డి, సినీ గేయ రచయిత అభియన శ్రీనివాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు బొల్లు యాదగిరి, బీఆర్ఎస్, టీడీపీ నాయకులు పొన్నెబోయిన రమేష్, డి. సత్యనారాయణచారి, బీజేపీ నాయకుడు పోచం సోమయ్య, కాంగ్రెస్ నాయకుడు అవిశెట్టి అవిలిమల్లు, దేవినేని అరవిందరాయుడు, టి.ఉప్పలయ్య, డి.సతీష్‌చారి, ఎండి.జాని ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గుర్రంపోడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో ప్రజలకు భద్రతతో పాటు నేరాలు నియంత్రించొచ్చని నల్లగొండ జిల్లా ఏఎస్పీ మౌనిక అన్నారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలకేంద్రంలో దాతల సహకారం, పోలీసుశాఖ సంయుక్తంగా రూ.1.50లక్షలతో ఏర్పాటు చేసిన 11సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడం సులభమవుతుందన్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. ఆమె వెంట కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, గుర్రంపోడు ఎస్‌ఐ పసుపులేటి మధు ఉన్నారు. మండలంలోని ఈ నెల 3న జూనుతుల గ్రామానికి చెందిన మారపాక సుధాకర్‌ను బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన బెల్లి వెంకన్న, పగడాల సైదులుతో పాటు మరికొందరు కులం పేరుతో దూషించి దాడిచేసి గాయపరచడంతో బాధితుని ఫిర్యాదు మేరకు ఏఎస్పీ మౌనిక గ్రామానికి వెళ్లి విచారణ చేశారు.

ఏదుళ్లకు నిధుల కేటాయింపుపై హర్షం

● సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపిన సీపీఐ ప్రతినిధి బృందం, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

నల్లగొండ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుళ్ల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపి, రూ.1800 కోట్లు కేటాయించినందుకు సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీరారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌లతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు మాట్లాడుతూ ఫ్లోరైడ్‌తో జీవచ్ఛవాలుగా కరువు ఎడారిగా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ఈ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం కోసం దశాబ్దాలుగా పార్టీ అనేక ఉద్యమాలు, పోరాటాలు, పాదయాత్రలు నిర్వహించిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత మాజీ సీఎం కేసీఆర్ పది సంవత్సరాల్లో డిండి ఎత్తిపోతల పథకానికి ఎక్కడి నుంచి నీరు తీసుకోవాలనే దానిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగడి అక్కడేలా ఉండిపోయిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు, ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టిందని వారు పేర్కొన్నారు.

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించడం అభినందనీయం

ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం అభినందనీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సోమవారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకం పూర్తయితే మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని భూములు సస్యశ్యామలమవుతాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. డబ్బీకార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, హాషం, ప్రమీల, ప్రభావతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్, సీపీఐ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, నెల్లికంటి సత్యం, పల్లా నర్సింహారెడ్డి

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకానికి పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈసందర్భంగా సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల లిఫ్టుల నిర్మాణ పనులకు అధిక నిధులు కేటాయించి పూర్తి చేస్తామని సీఎం తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపినట్లు పేర్కొన్నారు. సీఎంను కలిసినవారిలో చందంపేట మాజీ ఎంపీపీ ఎర్పుల గోవిందు ఉన్నారు.

ఆదివాసీల భూమి లాక్కునేందుకు కుట్ర

● కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం జాతీయ చైర్మన్ శివాజీరావు మోగే ● సాగర్‌లో కొనసాగుతున్న శిక్షణ తరగుతులు

నాగార్జునసాగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గిరిజనులు, ఆదివాసీల భూమి, అడవిని లాక్కొని కార్పొరేటర్లకు లీజుకు ఇవ్వాలని చూస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం జాతీయ చైర్మన్ శివాజీరావు మోగే అన్నారు. వారం రోజుల పాటు నల్లగొండ జిల్లా జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ విధానాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ప్రధాని మోదీ పేదలు, రైతులు, గిరిజనులు, ఆదివాసీలకు నష్టం కలిగించే విధానాలు అవలంబిస్తున్నారని, 25కోట్ల మంది ఆదివాసీలకు నష్టం కలిగించే అటవీ బిల్లు- 2016ను కేంద్ర ప్రభుత్వం అమోదించి మూడింట రెండు వంతుల అటవీ ప్రాంతం స్థానంలో, మూడింట ఒక వంతు అటవీ ప్రాంతాన్ని మాత్రమే కొండ ప్రాంతాలకు రిజర్వ్ చేస్తామని ఆదివాసీల హక్కులు హరిస్తోందన్నారు. ఆదివాసీలు వారి హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. దేశంలో గిరిజన ఆదివాసీలు వివిధ ప్రాంతాల్లో భిన్న సంప్రదాయాలతో ఉండడంతో వారి భాష, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉన్నాయన్నారు. బ్రిటీష్ కాలంలో ఎక్కువగా అడవులు కొండలపై నివసించే తెగలు ఆదివాసీలే అని తెలిపారు.



సాగర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్

15రాష్ట్రాల ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నాం : తేజావత్ బెల్లయ్యనాయక్, ట్రైకార్ చైర్మన్

గిరిజన, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా 15 రాష్ట్రాలకు చెందిన గిరిజన, ఆదివాసీలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా నాగార్జునసాగర్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. రెండో విడత శిక్షణ తరగతులు వచ్చే నెలలో కర్నాటక రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఐదు వేల మంది కాంగ్రెస్ గిరిజన ఆదివాసీ ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఆదివాసీలకు అటవీ హక్కులు కల్పించాలి : కోదండరాం, ఎమ్మెల్సీ

గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి అటవీ హక్కులు కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ఆదివాసీలను ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో కృష్ణపట్టి ప్రాంతంలో పాటు వివిధ జిల్లాల్లో అటవీ భూములు సేద్యం చేసుకునే హక్కులు కల్పిస్తుందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. సాగర్‌లో నిర్వహిస్తున్న గిరిజన, ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల శిక్షణ తరగతుల్లో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రెవెన్యూ చట్టాల గురించి తెలుసుకోవాలి : సునీల్ జీ, భూ భారతి చట్టం రూపకర్త

రెవెన్యూ అటవీ చట్టాల గురించి గిరిజన ఆదివాసీలు తెలుసుకోవాలని భూ భారతి చట్టం రూపకర్త సునీల్ జీ తెలిపారు. రెవెన్యూ బాషలో ఉన్న పహణీ, గ్రామ కంఠం, అసైన్డ్ భూమి, ఆయకట్టు, బంజారు భూమి, ఆగ్రహారం, ఇనాం, అడంగల్ పహణీ, కమతం అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ శంకర్‌నాయక్, నాయకులు నక్రునాయక్, పాండునాయక్, మునినాయక్, సచిన్‌పాండే, రాహుల్, నాగేశ్వర్‌నాయక్, నరేందర్‌నాయక్, సాగర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీపీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

శాలిగౌరారం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో సోమవారం పీఆర్‌టీయూటీఎస్-2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు కుక్కడపు శ్రీనివాస్, చిత్తలూరి సత్యనారాయణ, కేతేపల్లి శ్రీను, సంపత్ కుమార్, కృష్ణయ్య, శ్రీరాములు, సంధ్యారాణి, సంధ్య, సంగీత, అనురాధ, శ్వేత, స్వప్న, సృజన, ఆంజనేయులు, రవి, యానుస్, మల్లేష్, వేణు, సహన, జేబున్నీస, రాధ, సరస్వతి, సువర్ణ, పావని పాల్గొన్నారు.

● కనగల్: కనగల్ తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను సోమవారం తహసీల్దార్ పద్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన క్యాలెండర్, డైరీ ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా తగు సమాచారంతో చక్కగా రూపొందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైదిరెడ్డి, కేశవరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కనగల్, జనవరి 6: (ఆంధ్రజ్యోతి) కనగల్ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఫిబ్రవరి 28వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ థామసయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రవేశ పరీక్షలను ఏప్రిల్ 13న పాఠశాలలో నిర్వహిస్తామని వివరించారు.

పాఠాలతో పాటు పరోపకారం

» ఆదర్శంగా నిలుస్తున్న గురుజ మహేష్ » సాయం చేస్తూ, అందిస్తున్న ఉపాధ్యాయుడు » దివ్యాంగులకు, విద్యార్థులకు చేయూత



విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న మహేష్

నాంపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలతో పాటు పరోపకారిగా ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు గురుజ మహేష్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్న చదువు ప్రాముఖ్యత తెలియజేస్తున్నారు. మరోపక్క సమాజానికి సేవ చేయాలనే తపనతో తన సంపాదనలో ఎదుటివారికి కొంత ఖర్చు చేస్తు దాతలు, ఎన్ఆర్ఐల సహకారంతో దివ్యాంగులకు, చదువుకునే విద్యార్థులకు సహాయం చేస్తు ఆదర్శంగా నిలుస్తున్నాడు. చండూరు మునిసిపల్ కేంద్రానికి చెందిన గురుజ మహేష్ ప్రస్తుతం నాంపల్లి మండలంలోని యూపీఎస్ దామెర పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మహేష్ 14 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ సామాజిక కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఉద్యోగ రీత్యా పలు పాఠశాలల్లో పనిచేసిన ఆయన ఆ పాఠశాల విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ స్కూల్ మానివేసిన, స్కూల్‌కు రాకపోయిన విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. స్కూల్‌కు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఒకవేళ వారి ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్స్‌తో పాటు ఇతర వస్తువులను అందజేసి ఆర్థిక సహాయం అందిస్తూ తన సేవాతత్వాన్ని చాటుకుంటున్నాడు. పాఠశాల ఏదైన సమాజసేవలో మార్పులేదు. విద్యార్థులు గురుకుల, మోడల్‌స్కూల్, నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచితంగా వాటికి సంబంధించిన మెటీరియల్‌ను అందించాడు.

పలువురికి ఉపాధి

అనకాపల్లి జిల్లాకు చెందిన పాము ప్రసాద్ అనే వ్యక్తి చర్మవ్యాధితో బాధపడుతుండగా అతనికి జీవనోపాధి కోసం రేకులడబ్బాను ఏర్పాటు చేసి కిరాణ సామగ్రి అందించాడు. దివ్యాంగ దంపతులైన కోనసీమ జిల్లాకు చెందిన రాజు రమణిలకు రూ. 1.20 లక్షల రూపాయలతో ఎలక్ట్రానిక్ స్కూటీని అందించి, కరీంనగర్ జిల్లాకు చెందిన రాజుకు లక్ష రూపాయలతో కిరాణ షాపు, ఆముదాల వలసకు చెందిన దివ్యాంగురాలు స్వప్నకు లక్ష రూపాయలతో గాజుల దుకాణాన్ని ఏర్పాటు చేసి అందించాడు.

విద్యార్థులకు అండగా...

నెవిళ్లగూడెం నుంచి నాంపల్లికి వెళ్లే విద్యార్థులు నడుచుకుంటూ వెళ్తున్నారని తెలిసి 11 మంది విద్యార్థులకు సైకిళ్లు ఇప్పించాడు. నేరేళ్లపల్లి పాఠశాలలో రూ.30వేలతో పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థికి స్టీల్ వాటర్ బాటిళ్లు, యూపీఎస్ దామెర పాఠశాలలో రూ.70వేలు విలువ జేసే డెస్క్ బెంచీలు, ప్రతి సంవత్సరం మండలంలో కొన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు రూ.2లక్షల మేరకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తాడు. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, హాస్టల్ ఫీజులు చెల్లిస్తూ వారికి అండగా నిలుస్తున్నాడు. కేతేపల్లి గ్రామానికి చెందిన పల్లేటి యాదమ్మ మల్లేష్‌లు అనారోగ్యంతో మృతి చెందాడు. వారి పిల్లల చదువుకోసం 7 నెలల పాటు ప్రతీ నెలా రూ.10వేలు అందజేస్తున్నాడు.



విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాను. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. స్ఫూర్తి ఫౌండేషన్, ఎక్స్‌ట్రా మొబైల్ ఫౌండేషన్, సత్యం చారిట్రబుల్ ట్రస్ట్, బిగ్‌హెల్ప్ ఫౌండేషన్, నల్లగొండ ఓఆర్‌జీ సంస్థ, స్నేహ హస్తాల ఫౌండేషన్, బిగ్ ద స్మైల్ ఫౌండేషన్ల సహకారంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చేయూతనివ్వడం ఆనందంగా ఉంది. రానున్న రోజుల్లో మరిన్ని పాఠశాలల్లో విద్యార్థుల అవసరాల కోసం కృషి చేస్తాం.

\- గురుజ మహేష్, ఉపాధ్యాయుడు, యూపీఎస్ దామెర పాఠశాల

అక్కెనపల్లి పీఏసీఎస్ పునరుద్ధరణపై హర్షం

నార్కట్‌పల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కెనపల్లిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం కావడంపై గ్రామ మాజీ సర్పంచ్ మాదాసు చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకుడు గాయం శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అక్కెనపల్లిలో ఇంతకుముందు కొనసాగిన పీఏసీఎస్‌ను పాలనా సంస్కరణల పేరుతో నార్కట్‌పల్లి పీఏసీఎస్‌లో విలీనం చేశారు. అక్కెనపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థుల పక్షాన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

శాలిగౌరారం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు నల్లగొండలో జరిగిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందారు. పాఠశాలకు చెందిన పి.పవిత్ర జిల్లా స్థాయిలో ప్రథమ, సౌమ్య మూడో స్థానం పొంది బహుమతులు అందుకున్నారు. ఇదే పాఠశాలకు చెందిన పద్మారావు, పూజలు కూడా ప్రతిభ కనబర్చి బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందారు. టాలెంట్ టెస్ట్‌లో బహుమతులు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలి



మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు

నకిరేకల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష చాలా గొప్పదని ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నియోజకవర్గ ప్రజలకు అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అయ్యప్ప స్వామిని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం నూతన స్వగృహంలో గురుస్వామి సి.వెంకటేశ్వరశర్మ నేతృత్వంలో సోమవారం అయ్యప్పస్వామి 3వ మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. పూజోత్సవంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు వివిధ మాలధారులకు అల్పాహార ప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, సినీనటుడు ప్రభాకర్, మునిసిపల్ చైర్మన్ చెవుగోని రజితశ్రీనివాస్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దైద నాగరాజుకు సావిత్రీబాయి పూలే అవార్డు



వేణుగోపాలచారి నుంచి అవార్డు అందుకుంటున్న దైద నాగరాజు

నార్కట్‌పల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సామాజిక కార్యకర్త దైద నాగరాజుకు సావిత్రీబాయి పూలే జాతీయ సేవా అవార్డు లభించింది. హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. మనం స్వచ్ఛంద సంస్థను స్థాపించి 100 రోజుల పాటు బాటసారులకు, అన్నార్థుల ఆకలి తీర్చే అన్నదాన కార్యక్రమంతో అందిస్తున్న సేవలను గుర్తించి నాగరాజును ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

హ్యాండ్‌బాల్‌లో విద్యార్థులు రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చెర్వుఅన్నారం హైస్కూల్ హెచ్‌ఎం రమ

కట్టంగూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ క్రీడలో విద్యార్థులు రాణించాలని చెర్వుఅన్నారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కుందాల రమ అన్నారు. సోమవారం మండలంలోని చెర్వుఅన్నారం ప్రభుత్వ హైస్కూల్‌లో ఉమ్మడి నల్లగొండ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టుకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహ భావం పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ నెల 12 వరకు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని హ్యాండ్ బాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో జరిగే 46వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యాయులు రాంమోహన్ రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగ, నగేష్, లింగయ్య ఉన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం మంజూరు

శాలిగౌరారం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆసిఫ్ నెహర్ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.26.49లక్షల పరిహారం మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తెలిపారు. అక్కినేపల్లి నుంచి ఆకారం వరకు భూములు కోల్పోయిన బైరవునిబండ రైతులకు రూ.24లక్షల2వేల149, తక్కళ్ల పహాడ్ గ్రామాల రైతులకు రూ.2,47, 457 మంజూరు అయినట్లు సమరంరెడ్డి తెలిపారు. ఆసిఫ్ నహర్‌తో మండలంలోని నాన్ ఆయకట్టు గ్రామాలైన బైరవునిబండ, తక్కళ్లపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,ఎమ్మెల్యే మందుల సామేలుకు కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తి ఇళ్లను వెంటనే పూర్తి చేయాలి



శాలిగౌరారం మండలం ఆకారంలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న వీరారెడ్డి, ప్రమీల

శాలిగౌరారం, నల్లగొండ రూరల్, కనగల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్‌లు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్నాయని, వెంటనే వాటి నిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంతో పాటు శాలిగౌరారం, కనగల్ మండలాల్లో పార్టీ ఆధ్వర్యంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లను ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టి దాదాపు ఏడేళ్లు కావస్తున్నా పూర్తి చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వా లు విఫలమయ్యాయన్నారు. నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ దిలివేయడం వల్ల నిరుపేదలకు ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణాలు పలు ద శల్లో ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధు లు స్పందించి అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణా లు పూర్తి అర్హులైన పేదలకు అందజేయాలని అన్నారు. లేనిచో సీపీ ఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు.

● శాలిగౌరారం మండలం ఆకారం, అడ్లూర్ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లను పార్టీ జిల్లా కార్యదర్శి తు మ్మల వీరారెడ్డి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల, సీ పీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య పరిశీలించారు. కార్యక్రమం లో మల్లయ్య, మండల నాయకులు మక్క బుచ్చిరాములు, కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, సిరిపంగి అంజి, గుండ్లపల్లి వెంకన్న, బల్లెం వెంకన్న, ఎస్‌కె. ఇస్మాయిల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్లాక్‌టవర్‌లో నిరవధిక సమ్మె

● నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన వారికి వెంటనే స్వాధీనం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పోరాట సాధన కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్‌లో నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన మొదటి రోజు ప్రారంభించారు. దీక్షలో కుర్చున్న వారికి పూలమాలలు వేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లాటరీ పద్ధతిన సాధించేందుకు జనవరి 10వ తేదీ వరకు రీలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల పోరాట సాధన కమిటీ కన్వీనర్ ఆవుట రవిందర్, సయ్యద్ హాసం, సత్తయ్య, పద్మ, ఆశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని పొనుగోడు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ ఇళ్లను పేదలకు పంపిణీ చేసి పట్టాలివ్వాలని గ్రామస్థులు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు తహసీల్దార్ పద్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలడుగు ప్రభావతి, కానుగు లింగస్వామి. ఎండీ అక్రమ్, సుల్తానా, నాగమ్మ, మహేశ్వరి, అమృత, అచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిరి ఇన్‌ఫ్రా డెవలపర్స్ బాధితులు

నల్లగొండరూరల్, చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలపై కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే పలువురు బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. డీటీసీపీ నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి, మోసం చేసిన సిరి ఇన్‌ఫ్రా డెవలపర్స్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని పానగల్ బైపాస్‌లో శివం కాలనీ, గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. సిరి ఇన్‌ఫ్రా యాజమాన్యం డీటీసీపీ నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్లాట్లు అన్ని అమ్మిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ బాధితుల పేర్కొన్న అంశాలపై, 20వ తేదీలోపు పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్ కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు యరెడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి కంది భాస్కర్, కార్యదర్శులు నర్సింహ, శివరాం దీక్షిత్, సభ్యులు నవీన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి శివారులో గల రెవెన్యూ, దేవాదాయశాఖకు సంబంధించిన భూముల్లో అక్రమ కట్టడాలు, ఇటీవల చేసిన సర్వే నామమాత్రంగా చేశారని, తప్పుడు హద్దులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో చేకూరి గణేష్, ఏర్పుల రాకేష్, ఏర్పుల దామోదర్ పాల్గొన్నారు. మండలంలోని వెలిమినేడులో రోడ్డును ఆక్రమించి చేస్తున్న ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థుడు మంకాల శ్రీను వినతిపత్రాన్ని అందజేశారు.

● నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లిలో కాలుష్యం వెదజల్లుతున్న ఎంపీఎల్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్య కారణంగా శ్వాస కోశ, చర్మ సంబంధిత వ్యాధులతో గ్రామస్థులు బాధపడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పంటలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించేలా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యాట చంద్రశేఖర్, కొంపల్లి భరత్, చిట్టిమల్ల శ్రవణ్‌కుమార్, బెల్లి నరేష్ పాల్గొన్నారు.

'ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

మర్రిగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర రైతు సమన్వయ కమిటీ సభ్యుడు బచ్చు రామకృష్ణ అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను 10శాతం కూడా అమలు చేయలేదన్నారు. రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు ఇస్తామని, ప్రస్తుతం రూ.12వేలు ఇస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమవుతుందన్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, యాదగిరి, బాలం నర్సింహ, మనోహర్ పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

గట్టుప్పల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గట్టుప్పల్ మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండలకేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలందరూ ఆర్థికంగా స్థిరపడే విధంగా భగవంతుడు ఆశీస్సులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు అవ్వరు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ చెరుపల్లి భాస్కర్, మాజీ సర్పంచ్ కర్నాటి అశోక్, పద్మశాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో నూతన మెనూను అమలు చేయాలి

నల్లగొండటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు ప్రకటించిన నూతన మెనూను అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన బీసీ సంక్షేమశాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం తక్షణమే వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకుడు బచ్చనబోయిన సాయికుమార్ యాదవ్, అఖిలేష్‌యాదవ్, రవికుమార్‌గౌడ్, పృథ్విరాజ్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి : శంకర్‌నాయక్



హాలియాలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శంకర్‌నాయక్

హాలియా, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా ప్రకటించడంతో సోమవారం హాలియాలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద ప్రతీ ఎకరానికి ఎలాంటి షరతులు లేకుండా రూ.12వేలు, భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా నెలకు వెయ్యి చొప్పున ఏడాదికి రూ. 12 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందే విధంగా పని చేస్తుందన్నారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, నాయకులు వెంపటి శ్రీనివాస్, గౌని రాజారమేష్‌యాదవ్, ప్రసాద్‌నాయక్, మజార్ మొయినుద్దీన్, జూపల్లి శ్రీను, భానుచందర్‌రెడ్డి, నెర్మటి వెంకట్‌రెడ్డి, సైదులుమాదిగ, శ్రీనివాస్, నాగిరెడ్డి, నర్సింహ, రమణారెడ్డి, నామని సుధాకర్, యడవల్లి రంజిత్, రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్, అశోక్, శ్రీనివాసులు, శేఖర్, ముత్యాలు పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ చాటిన విద్యార్థులు

నాంపల్లి, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీజీ పాఠశాల విద్యార్థులు ఆదివారం భువనగిరి జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో కె.విఘ్నేష్ బంగారు పతకం, వర్షిత, అర్జున్, ఎలివ్‌శ్రేష్ఠ, అఫ్రిద్‌లు సిల్వర్ పతకాలు సాధించారు. సోమవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్ఐ శోభన్‌బాబు పోలీస్‌స్టేషన్‌లో అ భినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్లు సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, రామేశ్వరి, పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ శోభన్‌బాబు

పెరిగిన హమాలీ రేట్ల జీవో విడుదలయ్యేంత వరకు పోరాటం

● ఏఐటీయూసీ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీ కార్మికుల పెరిగిన హమాలీ రేట్ల జీవో విడుదల చేసేంత వరకు పోరాటం ఆపే ప్రసక్తి లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే హమాలి రేట్ల పెరుగుదల విషయంలో సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అక్టోబర్లో అగ్రిమెంట్ జరిగినప్పటికీ జీవ విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు పెరగడం లేదని, అయినప్పటికీ సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు ఇస్తానన్న రేట్ల ప్రకారమే చేస్తామని అంగీకరించామన్నారు. ఒప్పుకున్న రేట్ల జీవో కూడా విడుదల చేయకుండా ఎందుకు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ప్రశ్నించారు. హమాలి కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దోనకొండ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు శ్రీనివాస్, భద్రయ్య, ఆంజనేయులు, నాగరాజు, వెంకటయ్య ,లింగయ్య, లింగస్వామి, జానయ్య, మహేష్, నాగయ్య, కృష్ణయ్య, పూల శ్రీను, రఘు, చంటి పాల్గొన్నారు

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.133	220	240
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 16.2

- పురుషుల కన్నా మహిళలే ఎక్కువ
- దేవరకొండ నియోజక వర్గంలో అత్యధిక ఓటర్లు
- భువనగిరిలో తక్కువ ఓటర్లు
- అత్యధిక మహిళా ఓటర్లున్నది ఆ ఆరు నియోజకవర్గాల్లోనే..



29,75,286

ఉమ్మడి జిల్లా ఓటర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 29,75,286 మంది ఓటర్లు నమోదయ్యారు. సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు జిల్లా ఎన్నికల అధికారులు ఈమేరకు తుది సవరణల అనంతరం ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 3,583 పోలింగ్ స్టేషన్లు నిర్ధారించారు. మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం విశేషం.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
దేవరకొండ (ఎస్టీ)	326	1,32,611	1,31,800	19	2,64,430
నాగార్జునసాగర్	306	1,16,278	1,21,300	19	2,37,597
మిర్యాలగూడ	264	1,16,222	1,21,313	26	2,37,561
నల్లగొండ	288	1,22,222	1,29,133	56	2,51,411
మునుగోడు	317	1,29,235	1,30,688	3	2,59,926
నకిరేకల్	311	1,25,991	1,29,316	4	2,55,311
హుజూర్‌నగర్	311	1,22,663	1,30,430	17	2,53,110
కోదాడ	296	1,20,150	1,27,077	20	2,47,247
సూర్యాపేట	271	1,19,999	1,26,424	14	2,46,437
తుంగతుర్తి	327	1,29,654	1,31,697	6	2,61,357
భువనగిరి	257	1,09,820	1,12,830	1	2,22,651
ఆలేరు	309	1,18,297	1,19,931	20	2,38,248
మొత్తం	3,583	14,63,142	15,11,939	205	29,75,286

ఉమ్మడి జిల్లాలోని 12 శాసనసభా నియోజవకర్గాలకు 14,63,142 మంది పురుష ఓటర్లు, 15,11,939 మంది మహిళా ఓటర్లు నమోదయ్యారు. ట్రాన్స్‌జెండర్లు 205 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. 12 నియోజకవర్గాల్లో దేవరకొండలో అత్యధికంగా 2,64,430 మంది ఓటర్లు నమోదవగా, భువనగిరిలో అత్యల్పంగా 2,22,651 మంది ఓటర్లు నమోదయ్యారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో దేవరకొండ నియోజకవర్గంలో అత్యధికంగా మహిళా ఓటర్లున్నారు. అయితే ఈ నియోజకవర్గంలో మహిళలకంటే పురుష ఓటర్లే ఎక్కువగా ఉండడం గమనార్హం. దేవరకొండ, తుంగతుర్తి, హుజూర్‌నగర్, నకిరేకల్, నల్లగొండ, కోదాడ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా నమోదయ్యారు. దేవరకొండ నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో పురుష ఓటర్లకంటే మహిళల ఓటర్లే ఎక్కువగా నమోదయ్యారు. ప్రస్తుత ఓటర్ల జాబితానే ఫైనల్ కాదని, కొత్తఓటర్లు, మార్పులు, చేర్పులు, సవరణలను ఎప్పటికప్పుడు కొనసాగించాలని ఎన్నికల జిల్లా అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.

పంటల నమోదుపై సందిగ్ధం

- ఓపెన్ కాని వ్యవసాయ శాఖ యాప్
- రైతుల వ్యతిరేకతపై ఇంటలిజెన్స్ రిపోర్టు ?
- సర్వే, రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణపై వెనుకడుగు



నల్లగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఈ నెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పంటల నమోదు సర్వే చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే వ్యవసాయశాఖ యంత్రాంగం అంతా సర్వేకు సిద్ధమైన నేపథ్యంలో 4వ తేదీన వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ ఓపెన్ కాకపోవడంతో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలోని 73 మండలాల్లోని గ్రామాల్లో పంటల నమోదు సర్వేను చేపట్టలేకపోయింది. క్షేత్రస్థాయిలో పంటల నమోదును ఎంపిక చేసిన 73గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల వరకు ప్రతీ గ్రామంలో సర్వే చేయాల్సి ఉంది. అయితే యాప్ ఓపెన్ కాకపోవడంతో నిలిచిపోయింది. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు సమాచారం. రైతుభరోసాను సంక్రాంతి పండుగనుంచి వేసే సమయంలో అనూహ్యంగా ఈ సర్వే చేపట్టాలనుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నెల 5వ తేదీన (ఆదివారం) ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు అయినందున పంటల నమోదు ప్రక్రియపై సోమవారం నిర్ణయం రావడంతోపాటు పంటల సర్వే మొదలవుతుందని సర్వత్రా భావించారు. కానీ రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నట్లు ఇంటలిజెన్స్ రిపోర్టు ప్రభుత్వానికి చేరింది. దీంతో పంటల నమోదు సర్వేతోపాటు 5, 6, 7తేదీల్లో రైతుభరోసా పొందాలంటే రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ అఫిడవిట్‌ను తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. అయితే ఈ రెండు అంశాలపై ప్రభుత్వం వెనకడుగు వేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంక్రాంతి నుంచి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరాకు రూ.6వేలను రైతుల ఖాతాల్లో జమచేయడానికి సన్నద్ధమైనట్లు తెలుస్తోంది.

అర్హులందరినీ ఓటరుగా
నమోదు చేయాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి

నల్లగొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా సోమవారం తుది ఓటరు జాబితాను ప్రచురించినప్పటికీ 18 ఏళ్లు నిండి ఓటరు నమోదుకు అర్హత ఉన్న వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని జిల్లా ఓటరు జాబితా పరిశీలికురాలు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఓటరు నమోదు అధికారులతో ఓటరు జాబితాలో ఈపీ, జెండర్ రేషియోలు, తుది ఓటరు జాబితా ప్రచురణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం అన్నిపోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయాల్లో తుది ఓటరు జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. ఓటర్లు వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో? లేదో ? పరిశీలించుకోవచ్చన్నారు. ఒకవేళ ఓటరు జాబితాలో ఎవరి పేరు లేనట్లయితే తిరిగి ఓటరు గా నమోదు చేసుకోవచ్చని, అంతేగాక 18 ఏళ్లు పూర్తయి ఓటరు నమోదుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదు అధికారులు మరోసారిఓటరు జాబితాలో చనిపోయిన వారిపేర్లు పరిశీలించి తొలగించాలని,18ఏళ్లు నిండినవారిని ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఓటరు నమోదు అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

నూతన మెనూ అమలుచేయాలి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రకటించిన నూతన మెనూ విషయంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకొని నూతన మెనూ అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని బీసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన బీసి సంక్షేమ శాఖ కమీషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు ఇరుకు గదుల్లో నివసిస్తూ అవస్థలకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వసతి గృహాలకు గురుకుల పాఠశాలలకు, కళాశాలలకు సొంతభవనాలని నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను కూడా తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకుడు బచ్చనబోయిన సాయికుమార్ యాదవ్, అఖిలేష్ యాదవ్, రవికుమార్ గౌడ్, పృథ్విరాజ్ , మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే
పరిష్కరించాలి: కలెక్టర్



నల్లగొండలో మహిళా ప్రాంగణంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖతో పాటు, అన్ని శాఖల అధికారులు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో 3శాతం అనాథలకు రిజర్వేషన్ అమలు చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళా ప్రాంగణం, మహిళా క్యాంటిన్ ఏర్పాటు, వైద్య, ఆరోగ్యశాఖ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్వో అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కాగా ఈ సోమవారం 87మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను సమర్పించారు.

ప్రజల్లో స్పందన ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలి

నల్లగొండ రూరల్: ప్రజల్లో స్పందన ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మహిళా ప్రాంగణాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి, మేనేజర్ అనిత, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 73మండలాల్లో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయడంకోసం కసరత్తు ముమ్మరం చేశారు. అయితే సొసైటీల ఏర్పాటు అదనంగా చేస్తే ఉన్న సిబ్బందితోనే సొసైటీలను నడపాల్సి ఉంటుంది. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో కొత్త పీఏసీఎస్‌ల నిర్వహణ ఏ మేరకు సఫలీకృతమవుతాయన్న దానిపై ఆదిలోనే కొంతమేరకు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన మండలాల్లో నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటుతోపాటు కొన్ని మండలాల్లో గ్రామాలసంఖ్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ కూడా సొసైటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



కొత్త పీఏసీఎస్‌ల కోసం
కసరత్తు ముమ్మరం

- అధికారులు, డీసీసీబీ పాలకవర్గం మల్లగుల్లాలు
- రీఆర్గనైజేషన్ చేస్తే సిబ్బంది కొరతతో ఇబ్బందులే
- ఉమ్మడి జిల్లాలో సొసైటీల కోసం ప్రతిపాదనలు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల రీఆర్గనైజేషన్ కోసం జరుగుతున్న కసరత్తుపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటుంది. సొసైటీల విస్తరణ జరిగితే ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, రైతుల సంఖ్య, దూరం ఎంత ఉంటుంది అనే దానిపై పరిశీలించాల్సి ఉంటుంది. కొత్త సొసైటీలను ఏర్పాటుచేస్తే పంట రుణాల మంజూరు, ఎరువులు, విత్తనాల విక్రయం, ధాన్యం కొనుగోలు కేంద్రాలవంటి నిర్వహణ సేవల విస్తరణను మరింత పెంచాలని పాలకవర్గం ఆలోచిస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని నూతన పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నారు.



రైతులకు మెరుగైన సేవల కోసం కొత్త సొసైటీలు

రైతులకు మెరుగైన సేవలను అందజేయడంకోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త సొసైటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. సొసైటీ ఏర్పాటు అదనంగా చేయడంవల్ల ఆ సొసైటీల సేవలు రైతులకు మరింత చేరువ కానున్నాయి. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్ని సొసైటీలు కొత్తగా ఏర్పాటు చేయాలనే దానిపై సమీక్షలు నిర్వహిస్తున్నాం. సొసైటీలను రీఆర్గనైజేషన్ చేసిన తర్వాత ఆయా ప్రాంతాల్లో కార్యాలయాల ఏర్పాటు, సిబ్బంది కొరత లేకుండా చూడాల్సి ఉంటుంది. రైతులకు మరింత ప్రయోజనం చేకూరడంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏర్పాట్లను చేస్తుంది. సొసైటీల విస్తరణ చేయడంవల్ల సేవలు మరింత సులభమవుతాయి. ఈ సొసైటీలను ఆమోదంకోసం ఆర్‌సీఎస్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

- కుంభం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్, నల్లగొండ

నూతనంగా సొసైటీలను ఏర్పాటు చేయాలంటే ఆర్‌సీఎస్(రిజిస్టర్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్) ఆమోదం తప్పనిసరిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇందులో ఆర్‌సీఎస్ అధికారులతోపాటు ఇతర అనుబంధశాఖ అధికారులంతా పాల్గొని సమీక్షలు నిర్వహించారు. సొసైటీలను ఏర్పాటుచేస్తే అందుకు కావాల్సిన సిబ్బంది, కార్యాలయాలు ఇతర ఏర్పాట్లు అన్ని చేయాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని వస్తున్న ప్రతిపాదనలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆర్‌సీఎస్ ఆమోదం తెలియజేయనుంది. అంతా సులువుగా ఆమోదం తెలియజేస్తే నిర్వహణ భారం అధికమై సొసైటీలు నిర్వీర్యమయ్యే అవకాశాలుంటాయి. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 107 సొసైటీల వరకు ఉన్నాయి. ఈ సొసైటీలు అన్ని ప్రస్తుతం ప్రగతి పథంలో ఉన్న పరిస్థితుల్లో కొత్త సొసైటీల ఏర్పాటు వల్ల ప్రయోజనం...

- మిగతా 6వ పేజీలో...

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్

మిర్యాలగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పౌష్టికాహారం అందించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి విద్యానగర్ కాలనీలోని సుభాష్‌నగర్ అర్బన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలతో ముచ్చటించారు. తండ్రి పేరు, తల్లి పేరు పిల్లల పేర్లు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లలకు పోషకాహారలోపం లేకుండా చూసేందుకు అంగన్‌వాడీల ద్వారా న్యూట్రిషియన్ ఫుడ్ అందిస్తోందన్నారు. గుడ్లు, పాలు, సన్నబియ్యం గర్భిణులు, బాలింతలకు ప్రొటీన్లు కలిగిన ఆహారం అందించాలన్నారు. పిల్లల బరువును తూచి వయసుకు తగిన బరువు వున్నారా? లేరా? అనే విషయాన్ని బట్టి వారికి ఆహారం ఇవ్వాలన్నారు. మిర్యాలగూడ అర్బన్‌లో 100, రూరల్‌లో 111 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, ప్రభుత్వం అందించే పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో అనిత, డీఏవో శర్మ, తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ మండలం బాబాసాహెబ్‌గూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డీడబ్ల్యూవో కృష్ణవేణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల నమోదు, ఆహార నాణ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు నకిరేకల్ సీడీపీవో ఆగాఅస్రా అంజుమ్, మండల సూపర్‌వైజర్ సునీత ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అనితా రామచంద్రన్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో
జిల్లాలో ప్రథమస్థానం

మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్



మిర్యాలగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జిల్లాలో మిర్యాలగూడ డివిజన్ ప్రథమ స్థానంలో ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణఅమిత్ అన్నారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేలో 95 శాతం పూర్తి చేసి నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలపారు. నల్లగొండ జిల్లాలో 95 శాతం సర్వే పూర్తి చేసి మిర్యాలగూడ డివిజన్ మొద టి స్థానంలో నిలిచిందని చెప్పారు. డివిజన్‌లో 1 లక్షా 50 వేల దరఖాస్తులు రాగా సర్వే చేసి డాటా ఎంట్రీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై పూర్తిస్థాయిలో సర్వే కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

• నిధుల కేటాయింపుపై హర్షం



డిండికి నిధుల కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించడం అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

• ముక్కోటి ముచ్చట

- ఈ నెల 10న ఉత్తర ద్వార దర్శనం
- సాధారణ భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు



యాదగిరిగుట్టలో అధికారులకు సూచనలు చేస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు

మిర్యాలగూడ
నాగార్జునసాగర్-దేవరకొండ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

శ్రీనివాస్, తహసీల్దార్, నేరేడుగొమ్ము



ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నవారిపై కఠినచర్యలు తీసుకుంటామని, ఇప్పటికే మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని నేరేడుగొమ్ము తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

- (నేరేడుగొమ్ము, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: ఇప్పటికే మండలంలోని కేతేపల్లిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నాం. ప్రభుత్వ భూములను గుర్తించి సర్వే చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పెద్దమునిగల్, వైజాగ్‌కాలనీలో ఓపెన్ జైల్ కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసుకుంటున్నారన్న ఫిర్యాదుల మాటేమిటి?

తహసీల్దార్: పెద్దమునిగల్, వైజాగ్ కాలనీ ఓపెన్ జైల్ కోసం 200 ఎకరాల వరకు సర్వే చేశాం. జైలు శాఖకు అప్పగించాల్సి ఉంది. ఆ భూమిని కబ్జా చేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: నూతన రేషన్‌కార్డులను ఎప్పుడు మంజూరు చేస్తారు?

తహసీల్దార్: ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన పేదలను గుర్తించి నూతన రేషన్ కార్డులు అందజేసేందుకు కసరత్తు జరుగుతుంది. త్వరలో అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి: తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత మాటేమిటి?

తహసీల్దార్: తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. ఇద్దరు ఆర్ఐలు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో పనిభారం అధికమవుతుంది.

ఆంధ్రజ్యోతి: ధరణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారు?

తహసీల్దార్: ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని ప్రవేశ పెడుతుంది. దీంతో ధరణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ త్వరలో పరిష్కారమవుతాయి. ఇప్పటి వరకు ధరణిలో 18 భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించాం.

బిల్లులు రాక పనులు నిలిచి..



గుర్రంపోడులో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణం

- సంపూర్తిగా మనఊరు - మనబడి
- బిల్లులు రాక పనులు నిలిపి వేసిన కాంట్రాక్టర్లు

గుర్రంపోడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సకల హంగులతో తీర్చిదిద్దాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు మన బడి' పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త వాటిని నిర్మించడం, మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగానే మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు కూడా ఈ పథకం మంజూరైంది. పాఠశాలలో నెలకొన్న గదుల కొరత తీవ్ర సమస్యగా మారింది. ఆ పథకం కింద శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం తొలగించి నూతన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరయ్యాయి. దీంతో గతేడాది పనులు ప్రారంభించగా స్లాబ్ స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మన బడి పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు కూడా అందక అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద పలు పాఠశాలలకు మౌలిక వసతులను కల్పిస్తున్నా మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులను మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం పాఠశాలలోని 40మంది విద్యార్థులకు గాలి, వెలుతురు లేని గదిలో బోధన కష్టతరంగా మారింది. భవన నిర్మాణాన్ని పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పలు పాఠశాలల్లో నిలిచిన పనులు

మండలంలోని కట్టవారిగూడెం పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదిని తొలగించారు. మన ఊరు మన బడి క్రింద నూతన భవన నిర్మాణాన్ని చేపట్టారు. స్లాబ్ వేయగా గోడలు నిర్మించాల్సి ఉంది. పాఠశాల యాజమాన్య కమిటీకి కేవలం రూ.70వేల బిల్లు మాత్రమే చెల్లించగా మరో పది లక్షల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. టాయిలెట్లు మంచినీటి సౌకర్యం తదితర నిర్మాణాలకు సంబంధించి బిల్లులు రావాల్సి ఉంది. చామలేడు పాఠశాలలో రెండు తరగతి గదులు మరమ్మతులకు సంబంధించి బిల్లులు కోసం రెండేళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద కొత్తగా పాఠశాలలకు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపడుతున్నా గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మన బడి పథకం కింద బిల్లులు మాత్రం అందించడం లేదు.

రెండేళ్లుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నా



చామలేడు ప్రాథమిక పాఠశాలలో బిల్లులు వెంటవెంటనే ఇప్పిస్తామని అప్పటి అధికారులు చెప్పడంతో పనులు చేశాం. అప్పులు చేసి పనులు చేశా. రూ.5లక్షల బిల్లు రావాల్సి ఉంది. అధికారుల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు ఎప్పుడిస్తారో చెప్పడం లేదు.

- శంకర్,ఎస్ఎంసీ మాజీ చైర్మన్,చామలేడు

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి



మన ఊరు మనబడి కార్యక్రమంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. చేసిన పనులకు సంబంధించి గతంలో ఉన్న అధికారులు ప్రతిపాదనలు పంపించారు.త్వరలోనే బిల్లులు వస్తాయని ఆశిస్తున్నాం.

- యాదగిరి, మండల విద్యాధికారి

'ఆదర్శ' ప్రవేశాలకు ఆహ్వానం

నిడమనూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. అదేవిధంగా పాఠశాలలో 7,8,9,10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం కూడా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

సబ్సిడీపై పెసర విత్తనాలు

హాలియా, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనుముల మండలంలో రెండు క్వింటాళ్ల పెసర విత్తనాలు పీఏసీఎస్‌లో అందుబాటులో ఉన్నాయని ఏవో సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెసర పంటకు విత్తనాలు కావాల్సిన రైతులు నాలుగు కిలోల బ్యాగుకు 100 రూపాయల సబ్సిడీ పోను రైతు వాటా కింద 492 రూపాయలు చెల్లించి తీసుకోవాలన్నారు. పెసర విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డ్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌ను తీసుకొని తమను సంప్రదించాలని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డులో సోమవారం నిర్వహించిన ఉమ్మడి పీఏపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. నియోజకవర్గంలోని రైతాంగానికి సాగునీరు అందించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోడియానాయక్, మండల ప్రధాన కార్యదర్శి ఆడేపు సతీష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఏడుకొండలుయాదవ్, నాయకులు వంగాల ప్రతాప్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జయంత్‌రెడ్డి, ముచ్చర్ల శ్రీకాంత్‌యాదవ్, చంద్రారెడ్డి, నీలం శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శన

కొండమల్లేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి భూతరాజు సాయి వర్షిత్ 'సేంద్రీయ ఎరువులు' అంశంపై ప్రదర్శించిన స్టాల్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థిని అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లెల జనార్ధన్‌రెడ్డి, గైడ్ టీచర్లు ఆర్.నరసింహ, కట్టెబోయిన శ్రీనివాసులు, భానుప్రకాశ్, బద్దెల అంజయ్య, అనురాధ, జానునాయక్, సరస్వతి, శ్రీనివాస్‌చారి, అశోక్‌కుమార్, నీరజ, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన వరుణ్

వేములపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీల్లో మండలంలోని సల్కునూరు జడ్పీ హైస్కూల్ ప్రదర్శన ద్వితీయస్థానం సాధించింది. పాఠశాలకు చెందిన విద్యార్థి రాచమల్ల వరుణ్ సేంద్రీయ వ్యవసాయం అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రదర్శన అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఎంఈవో లక్ష్మణ్ నాయక్ సోమవారం వరుణ్‌ను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందించేని మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పోటీల ద్వారా వెలికితీయవచ్చని అన్నారు. వరుణ్ భవిష్యత్తుల్లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీమా, ఉపాధ్యాయులు ఇంతియాజ్, సతీష్‌కుమార్, మమత, శశిధర్‌రెడ్డి, శేఖర్, చిట్యాల జానయ్య, ఉమబాయి పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- డీపీవో వెంకయ్య



డీపీవోను సన్మానిస్తున్న దేవరకొండ ఎంపీడీవో డానియెల్, డివిజన్ ఇన్‌చార్జి అధికారి నీలిమ, అధికారులు

దేవరకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా గ్రామపంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. దేవరకొండ పట్టణంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీలు, వసతిగృహాలు, హాస్టళ్లు సందర్శించి సమస్యలను తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలపై ఉందన్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా దేవరకొండకు వచ్చిన డీపీవోను పలువురు మండల పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవరకొండ ఎంపీడీవో డానియెల్, డివిజన్ పంచాయతీ అధికారిణి నీలిమా, అన్ని మండలాల పంచాయతీ అధికారులు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ అభివృద్ధికి కృషి చేయాలి

హాలియా, జనవరి 6(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని శ్రీ తారకరామ కమర్షియల్ కాంప్లెక్స్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం నూతన అధ్యక్షుడు బచ్చు సతీష్ అన్నారు. సోమవారం పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రావిరాల నర్సయ్య, మంచరుకొండ వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా బచ్చు సతీష్, ఉపాధ్యక్షులు బూడిద గోవిందు, సముద్రాల అరవింద్, గౌరవ సలహాదారులు కొండూరు వెంకటేశ్వర్లు, ముజ్జ మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శిగా వర్కాల రఘు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

పదోన్నతులను రెగ్యులర్ చేయాలి

మిర్యాలగూడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మెరిట్ ప్రాతిపదికన సీనియారిటీలను ప్రకటించి లిస్ట్ ప్రకారం ఇప్పటికే ఇచ్చిన పదోన్నతులను రెగ్యులర్ చేయాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూన్2, 2014 తర్వాత పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని అన్నారు. హైదరాబాద్ విశ్వేశరయ్య భవన్‌లో జనవరి 8న జరిగే విద్యుత్ బీసీ ఉద్యోగుల 19వ రాష్ట్ర మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభకు రాజ్యసభ సభ్యులు, విద్యుత్ బీసీ సంఘం సలహాదారు ఆర్.కృష్ణయ్య, ఎంపీ ఈటెల రాజేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించనున్నట్లు తెలిపారు. విద్యుత్ బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దవూర, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలూరు గ్రామపంచాయతీ పరిధిలోని తమడపల్లి గ్రామానికి చెందిన జక్కులి చిన్నయ్య అనే ఆటో డ్రైవర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామ ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు సోమవారం చిన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు 50 కేజీల బియ్యం, వంట సామగ్రి, రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు రావులపాటి శంకర్, ఉపాధ్యక్షుడు జానపాటి కొండలు, కమ్మంపాటి సత్యం, జిల్లా కోటేష్, పసుల రవి, కుక్క సైదులు, సింగారం ప్రశాంత్, కట్టా మహేష్, దోరెపల్లి నవీన్, రావులపాటి రాంబాబు, రావులపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గుమ్మడవెల్లి గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా నౌను మహేష్ మాదిగ, ఉపాధ్యక్షుడు ఆదిరాల వెంకటయ్య మాదిగ, కార్యదర్శి యాదయ్యమాదిగ, సహాయ కార్యదర్శి మాతంగి యాదయ్య మాదిగ, కోశాధికారిగా జినుకల లింగస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదిరాల రమేష్, పి.అనిల్, కూర సాలయ్య, ఆదిరాల జానయ్య, ఆదిరాల రాములు, ఆదిరాల శ్రీనివాస్, ఈదయ్య, అంజయ్య, కొండల్, ఆంజనేయులు, వంశీ, గోవర్దన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

దేవరకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంకూరి శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా సమానంగా మెనూ అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు యలమల గోపీచంద్, సంతోష్, హేమసుందర్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి : శంకర్‌నాయక్



హాలియాలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శంకర్‌నాయక్

హాలియా, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా ప్రకటించడంతో సోమవారం హాలియాలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద ప్రతీ ఎకరానికి ఎలాంటి షరతులు లేకుండా రూ.12వేలు, భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా నెలకు వెయ్యి చొప్పున ఏడాదికి రూ. 12 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందే విధంగా పని చేస్తుందన్నారు. అదే విధంగా రైతులకు రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, నాయకులు వెంపటి శ్రీనివాస్, గౌని రాజారమేష్ యాదవ్, ప్రసాద్‌నాయక్, మజార్ మొయినుద్దీన్, జూపల్లి శ్రీను, భానుచందర్ రెడ్డి, నెర్మటి వెంకట్‌రెడ్డి, సైదులుమాదిగ, శ్రీనివాస్, నాగిరెడ్డి, నర్సింహ, రమణా రెడ్డి, నామని సుధాకర్, యడవల్లి రంజిత్, రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్, అశోక్, శ్రీనివాసులు, శేఖర్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

కొండమల్లేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రావుల వెంకటయ్య బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వాన్ని కలిగి ఉన్నాడు. విద్యుదాఘాతంతో వెంకటయ్య ఏడాది క్రితం మృతి చెందాడు. ఈ మేరకు బీమా కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ బాధితుని కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేసాని లింగారెడ్డి, రావుల వెంకటేశ్వర్లు, వస్కుల కృష్ణయ్య, గుండాల రాజేష్, వడ్త్య బాలు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి



డీఏవో శర్మకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారి శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సీపీఎం బృందం అన్ని చోట్ల డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి అనేక సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లకు కరెంట్, మంచి నీరు, రోడ్ల వంటి సౌకర్యాలు లేవని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా ఇళ్ల పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి అర్హులైన పేదలకు ఇళ్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం వన్‌టౌన్, టూటౌన్ కార్యదర్శులు మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, నాయకులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, ఆయూబ్, ఉన్నం వెంకటేశ్వర్లు, గుణగంటి రామచంద్రు, కోడిరెక్క మల్లయ్య, మంద రాజు, శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతవుతున్న మైనర్‌కాల్వలు

- సాగునీటికి రైతుల ఇబ్బందులు
- ఆందోళనకు దిగిన రైతులు



నీరు లేక నాటు వేయకుండా నిలిచిపోయిన పొలం

మిర్యాలగూడ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మైనర్ కాల్వలను కొందరు తమ వ్యవసాయ భూముల్లో కలుపుకోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. దీంతో దిగువన ఉన్న రైతుల పొలాల్లోకి అధికంగా నీరు ప్రవహిస్తుండటంతో మేజర్ వద్ద తూములను మూసివేశారు. మధ్యలో ఉన్న రైతులు నాటు వేయకుండానే కాల్వ నిలిపివేయడంతో సోమవారం ఆందోళనకు దిగారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామం వద్ద నాటు వేసిన పొలాలకు, నాటుకు సిద్ధమైన పొలాలకు నాలుగు రోజులుగా సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిల్లాపురం మేజర్ ఆర్-1 మైనర్ కింద సుమారు 600 ఎకరాల్లో వరి సాగు చేపడుతున్నారు. ఎగువన, దిగువన ఉన్న రైతులు నాట్లు వేసుకొని సాగుకు సిద్ధమయ్యారు. మధ్యలో 200 ఎకరాలలో నాట్లు పూర్తి కాలేదు. చిల్లాపురం మేజర్ నుంచి ఆర్-1 మైనర్ ద్వారా సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీని ద్వారా చిల్లాపురం, పొట్టిగానితండా, దుబ్బతండా, శ్రీనివాస్‌నగర్, సామ్యతండా గ్రామాలకు సంబంధించిన రైతులకు సాగునీరు ఆధారం కలిగిన మైనర్ కాల్వ చివరి వ్యవసాయ భూముల వద్ద ఆక్రమణలు చేపట్టడంతో రైతుల వినియోగానికి మించిన వృథా నీరు తుంగపాడు బంధంలో కలవాల్సి ఉంది. కాగా కొందరు రైతులు కాల్వలను ఆక్రమించుకోవడంతో వృథా నీరు కొంతమంది వ్యవసాయ భూముల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిల్లాపురం వద్ద తూమును మూసివేస్తున్నారు. ఈ క్రమంలో ఎగువన, దిగువన ఉన్న రైతుల కంటే మధ్యలో శ్రీనివాస్‌నగర్ వద్ద ఉన్న రైతులకు అవసరానికి సాగునీరు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



నాటు వేసిన వరి పొలానికి నీరు అందకపోవడంతో ఆందోళన చేస్తున్న రైతులు

మైనర్ కాల్వలు మాయం

ఆర్-1 మైనర్ నుంచి రైతులకు అవసరానికి మించిన సాగునీరు కిందకు ప్రవహించి తుంగపాడు బందం లోకి వెళ్లేలా పిల్ల కాల్వలు ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం కొందరు రైతులు కాల్వలను తమ వ్యవసాయ భూముల్లో కలుపుకోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి కొంతమంది పొలాల్లోకి చేరుతుండటంతో మేజర్ వద్ద తూములు మూసివేయడం కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతుంది. దీంతో మెరక పొలాలకు అవసరమైన సాగునీరు నిలిచిపోవడంతో నాట్లు వేసేందుకు సిద్ధమైన రైతులు, నాటు వేసిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పట్టింపులేని అధికారులు

కొన్నేళ్లుగా రైతులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్వపై ఉండే సిబ్బంది, పర్యవేక్షించాల్సిన అధికారులు ఈ విషయంపై నిర్లక్ష్యం ప్రదర్శించడంతో మధ్యలో ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత ప్రాతిపదికన అన్యాక్రాంతమైన కాల్వలను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

నోటీసులు అందించాం

కాల్వల ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. ఆక్రమణదారులకు నోటీసులు అందించాము. భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- శారద, ఏఈఈ

వ్యవసాయ విద్యార్థుల క్షేత్ర పరిశీలన

కొండమల్లేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన ప్రయోగశాల కేంద్రాన్ని సోమవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ హార్టికల్చర్ కళాశాలకు చెందిన బీఎస్సీ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పరిశీలించారు. గ్రామీణ ఉద్యాన సంక్షేమ అనుభవ ప్రాజెక్టులో భాగంగా రీసెర్చ్ హెడ్ కిరణ్, సైంటిస్ట్ రాజాగౌడ్‌ల ఆధ్వర్యంలో 17 మంది విద్యార్థులు క్షేత్ర పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్నఅడిశర్లపల్లి, అంగడిపేట, పోలేపల్లి గ్రామాల్లో రైతులకు చెందిన పండ్లు, కూరగాయలు, పూల తోటలకు సంబంధించిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల శిక్షణలో భాగంగా విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వచ్చినట్లు సైంటిస్ట్ రాజాగౌడ్ తెలిపారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థులు బాలకృష్ణ, జలంధర్, నరేష్, సాయి, కృష్ణ రిసికేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.